www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల : 5.00

Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి :1 | సంచిక : 359 | శుక్రవారం | 7 జూన్ 2024



అమెరికా 'సూపర్' విక్టరీ

8 లో..



బీజేపీ తెలంగాణ రాజకీయాలపై గట్టిగానే ఫోకస్ పెట్టనుంది. బీఆర్ఎస్ కనుమరుగు కావడంతో ఆ పాత్ర లో పరకాయ ప్రవేశం చేసేందుకు కసర్తుత చేసే అవకాశం ఉంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కొంత బలం చాటిని బిజెపి ఇప్ప డు ఎంపీ ఎన్నికలతో మరింత బలోపేతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఇక్కడ గెలిచిన 8మంది ఎంపీల్లో మరోమారు ఒకరిద్దరికి మంత్రి పదవులు దక్కే ఛాన్స్ ఉంది. కిషన్ రెడ్డి గత మంత్రివర్గంలో ఉన్నారు. ఇప్పడు ఆయనకు ఇస్తారా లేక మరెవరికైనా ఇస్తారా అన్నది చూడాలి. మరోవైపు కెసిఆర్ అవినీతి పై చర్యలు తీసుకోవాలన్న పట్టుదల కాంగ్రెస్ , బీజేపీ నేతల్లో కనిపిస్తోంది. ప్రభుత్వ ఏజె న్సీలు కూడా కేసీఆర్‌పై నిఘా పెట్టాయని బీజేపీ పరోక్షంగా హెచ్చరికలు చేస్తోంది. ఎన్నికలకు ముందు కేసీఆర్ చుట్టూ కేంద్ర పెద్దలు ఉచ్చు బిగిస్తున్నట్లు ప్రచారం చేశారు. ఇంతకాలం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి సంస్థలు ఏ క్షణంలోనైనా రంగంలోకి దిగవ చ్చని లీకులు ఇచ్చారు. నీటిపారుదల శాఖ కు చెందిన అనుచిత చెల్లింపులకు సంబం ధించి నిర్దుష్టమైన ఆధారాలు కేంద్ర ప్రభుత్వ వద్ద ఉన్నాయిన బిజెపి నేతలు బాహాటం గగానే చెబుతున్నారు. జైలుకు పంపుతామని పదేపదే చెబుతూ వచ్చారు.

# తెలంగాణపై బీజేపీ ప్రత్యేక ఫోకస్

## కేసీఆర్ అవినీతి, అక్రమాలపైనా దృష్టి

## అధికారం లక్ష్యంగా బీజేపీ ప్లాన్



**హైదరాబాద్, ప్రజానావ:** ఆంధ్రప్రదేశ్ విషయం ఎలా ఉన్నప్పటికీ తెలంగాణలో అధికారంలోకి రావాలని బీజేపీ పట్టుదల ఇప్పుడు మరింతగా పెరిగింది. కాంగ్రెస్‌కు తామే ప్రత్యామ్నాయం అని చెబుతున్నారు. ఇకపోతే బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సాధారణ కార్యకర్త సైతం అత్యున్నత పదవిని అందుకో వడం బీజేపీలోనే జరుగుతుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందని అంటున్నారు. బీజేపీకి కులం, మత భేదాల్లేవని.. పేదరికమే ప్రాథమికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని వెల్ల డించారు. ప్రజాధనాన్ని కేసీఆర్ దుబారా చేయడాన్ని సహించలేదని, అందుకే ఎన్నికల్లో ఓడించారని అన్నారు.



# రిజర్వేషన్ల రద్దు పేరుతో దుష్ప్రచారం

## కాంగ్రెస్ తప్పడు ప్రచారంతోనే దెబ్బతిన్నాం

## తెలంగాణ ప్రజల గుండెచప్పడుగా ఉంటాం

- భవిష్యత్‌లో తెలంగాణలో మరింత సత్తా చాటుతాం
- ఏపీలో కూటమి గెలుపుతో మంచి రోజులు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి

2 లో..



# చిరు ఆశీర్వాదం తీసుకున్న పవన్

## మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో సందడి

- పాదాభివందనం చేసి ఆలింగనం చేసుకున్న తమ్ముడు
- కేక్ కట్‌చేసి, బాణాసంచాతో స్వాగతించిన మెగా ఫ్యామిలీ
- ప్రధాని మోడీతో పవన్ భేటీ
- కుమారుడు అకీరా నందన్ పరిచయం

2 లో..



## లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ ?

- రాహుల్ ఎంపికకే మొగ్గు చూపుతున్న కాంగ్రెస్ ఎంపీలు

2 లో..

## ఇక సింగరేణిని పరుగులు పెట్టిద్దాం

- ప్రైవేటుతో పోటీపడేలా చేద్దాం
- అధికారులకు సీఎండీ బలరామ్ సూచన

3 లో..

## ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీ, ఎన్‌డీఏ కసరత్తు

2 లో..

- దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ హడావుడి
- నేడు ఎంపీల భేటీలో నేతగా మోడీ ఎంపిక
- కీలక మంత్రి పదవులపై దృష్టి పెట్టిన టీడీపీ, జేడీయూ




## ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న

- ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో గందరగోళం
- రిటర్నింగ్ అధికారి తీరుపై బీఆర్ఎస్ అభ్యంతరం

2 లో..



# హైదరాబాద్‌లో భారీ వర్షం

## ప్రధాన రహదారులపై నిలిచిన వాన నీరు

## ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బందులు

2 లో..



# ప్రభుత్వ ఏర్పాటులో బీజేపీ, ఎన్డీఏ కసరత్తు

- దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ హడావుడి
- నేడు ఎంపీల భేటీలో నేతగా మోడీ ఎంపిక
- కీలక మంత్రి పదవులపై దృష్టి పెట్టిన టీడీపీ, జేడీయూ

**న్యూఢిల్లీ, మే 6 :** దేశరాజధాని హస్తినలో రాజకీయ వాతావరణం హడావిడి కనిపిస్తోంది. ఎన్డిఎ నేతల రాక, గెలిచిన ఎంపిలంతా ఢిల్లీకి చేరుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముందు శుక్రవారం బిజెపి ఎంపిలతో మోడీ భేటీ కానున్నారు. అలాగే ఎన్డిఎ పక్ష ఎంపీలతోనూ వేరుగా భేటీ కానున్నారు. వీరంతా కలిసి మోడీని నేతగా ఎన్నుకున్న తరవాత, ఎన్డిఎ నేతలతో కలసి మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మను కలుసుకుంటారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతి కోరుతూ లేఖను అందచేస్తారు. ఈ క్రమంలో 8న మోడీ ప్రమాణస్వీకారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్డిఎ కూటమి పార్టీలతో కలసి బిజెపి మ-రోమారు అధికారం చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో కూటమిలో భాగస్వామ్య పార్టీలైన టిడిపి, జెడియు కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కీలకంగా మారాయి. ఈ పార్టీలు తమ ప్రధాన డిమాండ్లను మోడీ ముందుంచినట్లు తెలుస్తోంది. అధికారికంగా బయటకు వెల్లడిరచనప్పటికీ బుధవారం జరిగిన ఎన్డిఎ సమావేశంలో మిత్రపక్ష పార్టీలు పదవుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, కీలక శాఖలను తమకు కేటాయించాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. కాగా, ఎన్డిఎ కూటమిలో 16 ఎంపీ సీట్లు గెలిచి కీలకంగా మారిన టిడిపి.. కొత్త ప్రభుత్వంలో ఐదు మంత్రి పదవులను ఆశిస్తున్నట్లు సమాచారం. లోక్‌సభ స్పీకర్, ఆర్థికశాఖ సహాయమంత్రి పదవులతో సహా ఐదు మంత్రిపదవులను డిమాండ్ చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అలాగే రోడ్లు, పంచాయతీరాజ్, ఆరోగ్యం, విద్య వంటి కీలకమైన శాఖలపై టిడిపి దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ శాఖల్లో కూడా టిడిపి మంత్రి పదవులను కోరే అవకాశముందని వార్తలొస్తున్నాయి. బీహార్‌లో 12 సీట్లు గెలుచుకున్న జెడియు కొత్త ప్రభుత్వంలో రైల్వే మంత్రి పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కర్ణాటకలో జెడిఎస్ పార్టీ రెండు ఎంపి సీట్లే గెలిచింది. ఈ పార్టీ వ్యవసాయ శాఖపై దృష్టిపెట్టినట్లు వార్తలొస్తున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో సరైన మెజార్టీ బీజేపీకి రాలేదు.. దీంతో కూటమి పార్టీలైన టీడీపీ, జేడీయూ మద్దతు చాలా కీలకం.. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తే మాకేంటి అని ప్రాంతీయ పార్టీలు తమ డిమాండ్లను ముందుంచే అవకాశాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్‌లో ఎన్డీయే ఎంపీల సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ ఎంపీలంతా ఢల్లీకి రానున్నారు. ఈ రాత్రికి బీజేపీ సీఎంలు, డిప్యూటీ సీఎంలు అందరూ ఢిల్లీకి రానున్నారు. అయితే గురువారం జనతాదళ్ ముఖ్య నేత కేసీ త్యాగి విరీడియాతో మాట్లాడుతూ.. ఆ పార్టీ డిమాండ్స్ గురించి ప్రస్తావించాడు. జేడీయూ పూర్తి సపోర్ట్ బీజేపీకి ఉంది.. స్పెషల్ షరతులు ఏం లేవు, కానీ అగ్నిపథ్ పథకంపై ప్రజల్లో విపరీతమైన వ్యతిరేకత ఉంది.. ఆ స్కీంపై కేంద్ర ప్రభుత్వం, రక్షణశాఖ ఒకసారి సవిరీక్షించాలని కోరారు. అలాగే బీహార్ కు స్పెషల్ స్టేటల్ అనేది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్, అది జేడీయూ నాయకుల మనసులో ఉన్న కోరికని ఆయన చెప్పుకొచ్చాడు. అటు టీడీపీ పార్టీ వర్గాలు కూడా బీజేపీకి మద్దతు ఇస్తే వచ్చే ప్రతిఫలం గురించి చర్చిస్తున్నారు. ఐటీ, విద్యాశాఖ లాంటి నాలుగు కీలక కేంద్ర మంత్రి పదవులను టీడీపీ పార్టీ డిమాండ్ చేస్తోందని సమాచారం.. ఇరు పార్టీలు ఈ కింద డిమాండ్లను బీజేపీ ముందు ఉంచుతాయని ఆయా పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదిలావుంటే హస్తినకు బీజేపీ నేతలు వెళుతున్నారు. ఎంపీలుగా విజయం సాధించిన తెలంగాణ ఎంపిలు బండి సంజయ్, డీకే అరుణ, రఘునందనరావు తదితరులు ఢల్లీకి వెళుతున్న వారిలో ఉన్నారు. నేడు ఢల్లీలో ఎన్డీఏ ఎంపీల సమావేశం జరగనుంది. బీజేపీ ఎంపీలు సమావేశానికి హాజరుకానుంది. ఇప్పటికే ఢల్లీలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు. ప్రస్తుతం మోదీ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎంపీలుగా గెలుపొందిన పార్టీ నేతలతో ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అనంతరం తర్వాత మిత్రపక్షాల నేతలు వేరుగా భేటీ అవుతారు. మంత్రివర్గంలో ఎవరెవరు ఉండాలి.. ఏ పార్టీకి ఎన్ని పదవులివ్వాలో చర్చిస్తారు. రాజకీయ అనిశ్చితికి ఆస్కారం లేకుండా త్వరగా ఈ పక్రియ ముగించాలని చంద్రబాబు, నితీశ్ గట్టిగా సూచించినట్లు ఎన్డీయే వర్గాలు తెలిపాయి. కాగా ప్రస్తుతం మోదీ కేబినెట్‌లో ఉన్న పలు వురు మంత్రులకు ఉద్వాసన తప్పదని, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాకు ఈసారి హెూం శాఖ కాకుండా వేరే శాఖను కేటాయిం చవచ్చన్న ప్రచారం జరుగుతోంది. టీడీపీ, జేడీయూ ఎంపీలకు కీలక మంత్రిపదవులు దక్కే అవకాశాలున్నాయని ఎన్డీయే వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. మోదీ కేబినెట్‌లో చేరా లని తమ పార్టీ నిర్ణయించినట్లు చంద్రబాబు వెల్లడించారు.

# చిరు ఆశీర్వాదం తీసుకున్న పవన్

- మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో సందడి
- పాదాభివందనం చేసి ఆలింగనం చేసుకున్న తమ్ముడు
- కేక్ కట్‌చేసి, బాణాసంచాతో స్వాగతించిన మెగా ఫ్యామిలీ
- ప్రధాని మోడీతో పవన్ భేటీ
- కుమారుడు అకీరా నందన్ పరిచయం

**హైదరాబాద్, ప్రజానావ :** మెగాస్టార్ చిరంజీవి ఇంట్లో జనసేన విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. తమ్ముడు గెలవడంతో కుటుంబం అంతా ఆనందలో మునిగితేలింది. పిఠాపురం ఎమ్మెల్యేగా గెలిచిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మెగాస్టార్ చిరంజీవి ఘన స్వాగతం పలికారు. తమ్ముడు పవన్ అన్న చిరంజీవి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. చిరు కూడా తమ్ముడిని ఆలింగనం చేసుకుని అబినందించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని చిరంజీవి నివాసానికి తన భార్య, కొడుకుతో కలిసి పవన్ వెళ్లారు. ఈ సందర్భంగా పవన్‌కు మెగా ఫ్యామిలీ గ్రాండ్ వెల్‌కమ్ చెప్పింది. ఎమ్మెల్యేగా గెలిచాక తొలిసారి పవన్, చిరంజీవి దగ్గరకు వచ్చారు. పవన్ కు పూలమాల వేసి గ్రాండ్ వెల్ కమ్ చెప్పారు చిరంజీవి. కేక్ కట్ చేసి మెగా ఫ్యామిలీ సెలబ్రేట్ చేసుకున్నారు. జనసేన కార్యకర్తులు, అభిమానులు పెద్ద ఎత్తున చిరంజీవి నివాసానికి చేరుకుని టపాసులు కాల్చారు. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన వీడియో సోషల్ విరీడియాలో ట్రెండ్ అవుతోంది. జూన్ 4న మంగళవారం వెలువడిన ఏపీ ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ 100 శాతం స్ట్రైక్ రేటుతో పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాలు, 2 లోక్ సభ స్థానాల్లో ఘన విజయం సాధించింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఈ ఎన్నికల్లో 164 అసెంబ్లీ స్థానాలతో పాటు 21 ఎంపీ సీట్లను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కూటమి విజయంలో పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారు.



### ప్రధాని మోడీతో పవన్ భేటీ

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి జయకేతనం ఎగురవేయడమే గాకుండా.. జనసేన పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ ఘన విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. తాజాగా జరిగిన ఎన్డీయే కూటమి నేతల సమావేశానికి తన కుటుంబంతో సహా హాజరయ్యారు. సతీమణి అన్నాలెజినోవా కొణిదెలతో పాటు తన కుమారుడు అకీరా నందన్‌ను సైతం దిల్లీకి తీసుకెళ్లారు. కూటమి నేతల భేటీ ముగిసిన అనంతరం ప్రధాని మోదీకి తన కుటుంబాన్ని పరిచయం చేశారు. ఈసందర్భంగా అకీరా ప్రధాని మోదీకి నమస్కరిస్తుండగా అతడి భుజంపై చేయి వేసి మోదీ మాట్లాడుతున్న ఫొటో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్ అవుతోంది. ఎన్నికల ఫలితాలు ముగిసిన అనంతరం పవన్‌కల్యాణ్‌కు ఆయన సతీమణి హారతి ఇస్తున్న వీడియోలోనూ వెనక అకీరానే కనిపించాడు. ఆ తర్వాత తెదేపా అధినేత చంద్రబాబు వద్దకు వెళ్లినప్పుడు పవన్.. అకీరాను తీసుకెళ్లారు. చంద్రబాబుకు పరిచయం చేయడమే కాకుండా, ఆయన కాళ్లకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకోమని సూచించారు. ఫలితాల రోజున ఆ ఫొటోలు విపరీతంగా వైరల్ అయ్యాయి.

# రిజర్వేషన్ల రద్దు పేరుతో దుష్ప్రచారం

- కాంగ్రెస్ తప్పుడు ప్రచారంతోనే దెబ్బతిన్నాం
- తెలంగాణ ప్రజల గండెచప్పుడుగా ఉంటాం
- భవిష్యత్‌లో తెలంగాణలో మరింత సత్తా చాటుతాం
- ఏపీలో కూటమి గెలుపుతో మంచి రోజులు వచ్చాయి
- బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్ 6 :** భాజపా రిజర్వేషన్లు రద్దు చేస్తుందని.. కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేసిందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో అత్యధిక ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ పోటీ చేయలేదు.. ఎంఐఎం పోటీ చేసింది. లోపాలు సరిదిద్దుకుని భవిష్యత్తులో రాష్ట్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తుంది. 6 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. భాజపాకు తెలంగాణ ప్రజలు 35 శాతానికిపైగా ఓట్లు వేశారు. మాపై విశ్వాసం ఉంచి.. అధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క శాతం ఓటింగ్ మాత్రమే పెరిగింది. తెలంగాణలో చాలా చోట్ల భారాసకు డిపాజిట్లు రాలేదు. రాష్ట్ర ప్రజలు కాషాయ పార్టీకి అండగా నిలబడ్డారు. గతంలో రేవంత్‌రెడ్డి గెలిచిన మల్కాజిగిరిలో కూడా మేం గెలిచాం. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, సిద్దిపేట ఉన్న మెదక్‌లో విజయం సాధించాం. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో భాజపా ప్రశ్నిస్తుంది. అమిత్‌షాపై తప్పుడు కేసు పెట్టారు. హస్తం పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తాం. ఏపీలో అద్భుతమైన మెజార్టీతో ఎన్డీయే అధికారంలోకి వచ్చింది. అక్కడి ప్రజలకు కృతజ్ఞతలని కిషన్‌రెడ్డి తెలిపారు.రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా సమిష్టిగా పనిచేస్తామని కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అయిపోయిందని ఈ సందర్భం గా గుర్తు చేశారు. అంతేకాదు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై ఆరు నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అక్రమంగా డబ్బులు వసూలు చేసి ఢిల్లీకి పంపిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ఇంకా నెరవేర్చడం లేదని గుర్తు చేశారు. ఫ్రీ ఆర్టీసీ బస్సు హామీ తప్ప ఏదీ నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో సికిం ద్రాబాద్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ పోటీ చేసి బీజేపీని ఓడించాలని చూసిందని కిషన్ రెడ్డిఅన్నారు. కానీ వారు అనుకున్నది జరగలేదని వెల్లడించారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా బీజేపీ అత్యధికంగా ఎనిమిది స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లకు బలమైన ప్రత్యామ్నా యంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది. బీజేపీ తెలంగాణ ప్రజల గుండెచప్పుడు అయ్యి సమస్యల గురిం చి నిలదీస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు ఇటీవల ఏపీలో చంద్రబాబు నాయుడు, పురంధేశ్వరి, పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి బ్రహ్మాం డమైన విజయం సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశా రు. ఈ సందర్భంగా ఈ ముగ్గురికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో ఏపీ ప్రజలకు మంచి రోజులు రానున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

**హైదరాబాద్, ప్రజానావ:** గురువారం సాయంత్రి నుంచి హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మియాపూర్, శేరిలింగంపల్లి, రాయదుర్గం, కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, బాలానగర్, సికింద్రాబాద్, హబ్సీగూడ, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్‌నగర్‌లో వాన పడిరది. దీంతో ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిరది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈదురుగాలుల కారణంగా పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. తెలంగాణలో నైరుతి రుతుపవనాలు విస్తరించడంతో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలుచోట్ల విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఇవాళ రాత్రి, రేపు కూడా హైదరాబాద్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ ?

### రాహుల్ ఎంపికకే మొగ్గు చూపుతున్న కాంగ్రెస్ ఎంపీలు

**న్యూఢిల్లీ, మే6 :** ఊహించని రీతిలో ప్రతిపక్ష కూటమి పుంజుకోవడం వల్ల దేశ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. మొగ్గు పూర్తిగా బీజేపీపై వైపే ఉంటుందని అనుకున్నా ప్రతిపక్షాలూ గట్టిగానే నిలబడ్డాయి. ఇండియా కూటమితో కాంగ్రెస్ అనూహ్యంగా బలపడిరది. 99 స్థానాలు సాధించి అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. ఈ క్రమంలో లోక్‌సబలో ప్రతిపక్ష నేత ఎవర్న చర్చ సాగుతోంది. ఈ మేరకు ఇండీ కూటమిలో సంప్రదింపులు, చర్చలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఎవరుంటారన్న చర్చ ఇండీ కూటమిలో మొదల్కెంది. మొత్తం సేనను ముందుండి నడిపించిన రాహుల్ గాంధీకీ ఆ అవకాశం దక్కవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. బీజేపీ తరవాత ఎక్కువ సీట్లు వచ్చింది కాంగ్రెస్‌కే. అంటే ప్రతిపక్ష హెూదా ఈ పార్టీకి వచ్చేసింది. అందుకే ఈ పార్టీకి చెందిన రాహుల్ గాంధీనే ప్రతిపక్ష నేతగా ఉంటారన్న చర్చ మొదల్కెంది. ప్రతిపక్షనేత గట్టిగా ఉంటేనే లోక్‌సభలో వాణి వినిపించడానికి అవకాశం ఉంటుంది. ప్రతిపక్ష నేతలకు ప్రాధాన్యం ఉంటుంది. కేబినేట్ మోదా కూడా వస్తుంది. ఈ క్రమంలో నాయకుడిగా ఎదుగేందుకు అవకాశం కూడా ఉంటుంది. రాహుల్ గాంధీయే విపక్ష నేతగా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులు కూడా కోరుకుంటున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈ ప్రతిపాదన తీసుకొచ్చారు. అయితే... కాంగ్రెస్ పార్లమెంటరీ విరీటింగ్‌లో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ రాహుల్ గాంధీయే ప్రతిపక్ష నేతగా ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. ట్విటర్‌లో ఓ పోస్ట్ పెట్టారు. నేను ప్రజలను ఓట్లు అడిగింది రాహుల్ గాంధీ పేరు చెప్పుకునే. లోక్‌సభలో ఆయనే ప్రతిపక్ష నేతగా ఉండాలి. ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలంతా ఈ ప్రతిపాదనకు మద్దతునిస్తారని అనుకుంటున్నాను. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఏం నిర్ణయిస్తుందో వేచి చూస్తాం అని ట్వీట్ చేశారు.

# ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న


- ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో గందరగోళం
- రిటర్నింగ్ అధికారి తీరుపై బీఆర్ఎస్ అభ్యంతరం

**నల్లగొండ, ప్రజానావ:** పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆధిక్యంలో తీన్మార్ మల్లన ఆధిక్యంలో ఉన్నారు. ప్రతి రౌండ్‌లోనూ ఆధిక్యం ప్రదర్శించారు. అయితే రిటర్నింగ్ అధికారి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్ రెడ్డి అభ్యంతరం చెప్పారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితాల ప్రకటనలో అధికారులు అవకతవకలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టారు. రిటర్నింగ్ అధికారి ప్రజాస్వామ్యాని కి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించారు. తమ అభ్యంతరాలు స్వీకరించిన తర్వాతనే కౌంటింగ్ మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పక్రియను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతానికి మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తి కాలేదు. నాలుగో రౌండ్ ఫలితం ఇంకా పెండిరగ్‌లోనే ఉంది. కాగా, బీఆర్ఎస్ నేతలతో అధికారులు చర్చలు జరుపు తున్నారు. ఈ క్రమంలో ఆధిక్యంలో తీన్మార్ మల్లన్న ఉన్నారు. అయితే నల్గొండ కౌంటింగ్ కేంద్రంలో ఆర్వో తీరును నిరసిస్తూ రాకేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన గెలుపును అడ్డు కునేందుకు ఓట్ల లెక్కింపులో అనేక అవకతవ కలకు పాల్పడుతున్నారు. కౌంటింగ్ కేంద్రాల నుంచి తమ ఏజెంట్స్‌ను బయటకు పంపిం చేస్తున్నారు. ఏకపక్షంగా ఫలితాలు ప్రకటిస్తు న్నారు. రౌండ్లు పూర్తయిన తర్వాత కనీసం తమ ఏజెంట్స్ వద్ద సంతకాలు కూడా తీసుకో వడం లేదు. ఆర్వోను కలిసేందుకు వెళ్తే పోలీ సులు అడ్డుకుంటున్నారు. 3 గంటల పాటు ఆర్వో ఆఫీస్ వద్ద పడిగాపులు పడాల్సి వస్తుంది. 17 వేల పైచిలుకు మెజార్టీని 18 వేల పైచిలుకుగా ఏకపక్షంగా ప్రకటించారు. మూడో రౌండ్‌లో తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజల తీర్పును శిరసావహిస్తాం. కానీ పారదర్శంగా కౌంటింగ్ జరపాలన్నది తమ డిమాండ్. ఒకే హాల్‌లో వెయ్యి ఓట్ల తేడా వచ్చింది. రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకువాలి. కౌంటిం గ్ సజావుగా నిర్వహించాలని తమ డిమాండ్ అని ఏనుగల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు.



# తెలంగాణలో బీజేపీ సత్తా చాటింది

### కాంగ్రెస్, బీఆర్ఎస్ కుట్రలు ఫలించలేదు : లక్ష్మణ్



**న్యూఢిల్లీ, జూన్ 6 :** ఉమ్మడి ఎపికన్నా తెలంగాణలో బిజెపి సత్తా చాటిందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఉమ్మడి ఏపీలోనూ బీజేపీకి ఏనాడు 8 ఎంపీ సీట్లు రాలేదన్నారు. ఎంరాష్ట్రంలో ఒంటరిగా పోటీ చేసి 35శాతం ఓట్లు సాధించామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి డ్రామాలు ఆడుతున్నాయన్నారు. గురువారం ఆయన విరీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిందన్నారు. మెదక్, కరీంనగర్ లోనూ బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికి పడిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని లక్ష్మణ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కాంగ్రెస్ సర్కార్ పై ప్రజా వ్యతిరేకత వచ్చిందని చెప్పారు. భారాస ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరుతారని మంత్రులు చెబుతున్నారని.. ఆ పార్టీ త్వరలోనే ఖాళీ అవుతుందని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం భాజపా ఎంపీలు కట్టుబడి ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని గెలిపించారని లక్ష్మణ్ అన్నారు.

# ఇక సింగరేణిని పరుగులు పెట్టిద్దాం


**• ప్రైవేటుతో పోటీపడేలా చేద్దాం • అధికారులకు సీఎండీ బలరామ్ సూచన**



**హైదరాబాద్, ప్రజానావ:** రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై సింగరేణిలో పాలన పరుగులు పెట్టాలని సంస్థ సీఎండీ ఎన్ బలరాం సూచించారు. కోడ్ నేపథ్యంలో నిలిచిన సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యోగులకు అందించాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం ప్రైవేటు రంగంతో పోటీ పడేలా మన సామర్థ్యాలను, ఆలోచనా విధానాలను మార్చుకొని ముందుకు సాగాలని సూచించారు. సింగరేణి వ్యాపార విస్తరణకు మంచి అవకాశాలు ఉన్నాయని.. అందరు అధికారులు, ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్థవంతంగా సకాలంలో నిర్వహించగలిగితే సంస్థను దేశంలోనే అత్యున్నత స్థాయిలో నిలబెట్టవచ్చని సీఎండీ ధీమా వ్యక్తం చేశారు. సంస్థ చేపట్టిన ప్రాజెక్టులు, కొత్త కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈ విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి 25కు పైగా శాఖల అధిపతులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు ఉత్పత్తి, రవాణాలపైనే నెలవారీగా సమీక్షలు నిర్వహించడం జరిగిందని.. ఇకపై ఇతర విభాగాల పనితీరుపైనా నెలవారీగా సమీక్ష నిర్వహించడం జరుగుతుందని సీఎండీ బలరాం తెలిపారు. ఆయా విభాగాలకు అప్పగించిన పనుల పురోగతిని నెలవారీగా తెలుసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పని గంటల వినియోగంతోపాటు మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. విధుల పట్ల అలసత్వం, లక్ష్య సాధన పట్ల నిర్లక్ష్యం చూపే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రతి నెలా ఆయా విభాగాల పనితీరులో మెరుగుదల కనిపించకపోయినా.. అప్పగించిన పనులను పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. అదే సమయంలో సంస్థ ఉన్నతికి అంకిత భావంతో పనిచేసే వారికి మంచి గుర్తింపు ఇస్తామని తెలిపారు. ఉత్పత్తితో పాటు సంక్షేమం, రక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రక్షణ విషయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగానికి ఖర్చుకు వెనకాడకుండా చర్యలు తీసుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎండీ గుర్తు చేశారు. కంపెనీ అభివృద్ధికి ఇచ్చే మంచి సూచనలను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డితో వివేక్ కుటుంబం భేటీ

## గడ్డం వంశీకృష్ణను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ప్రజానావ:** హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు మర్యాదపూర్వంగా కలిశారు. పెద్దపల్లి నుంచి కాంగ్రెస్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిచి న గడ్డం వంశీకృష్ణను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. వంశీకృష్ణతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, విశాఖ ఇండస్ట్రీస్ ఎండీ గడ్డం సరోజ వివేక్ ఉన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ 8 సీట్లు సాధించి తమ పాలనకు రెఫరెండంగా చాటుకుంది. పెద్దపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఎంపీగా గడ్డం వంశీకృష్ణ దాదాపు లక్షా 30 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలో 15 లక్షల 96 వేల 430 ఓట్లకుగాను 10లక్షల 83వేల 453 ఓట్లు పోలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 4లక్షల 80వేల 994 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్‌కు 3లక్షల 49వేల 339 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1లక్షల 94వేల 821 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 1లక్షల 31వేల 771 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.

# నేటి నుంచి ప్రజావాణి పునఃప్రారంభం

## యధావిధిగా అర్జీల స్వీకరణ

**హైదరాబాద్, ప్రజానావ:** ప్రజావాణి యధావిధిగా శుక్రవారం పునఃప్రారంభం కానుంది. లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వల్ల తాత్కాలిక వాయిదా పడింది. అయితే.. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ముగిసినందున తిరిగి ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి వెల్లడించారు. ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నట్లు ప్రజావాణి ఇంచార్జీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి తెలిపారు. దేశ వ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందు వల్ల ప్రజావాణి అర్జీల కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడిందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో ప్రతి వారం మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని చిన్నారెడ్డి వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని చిన్నారెడ్డి కోరారు. ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ గా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారు.

# ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి

**పెద్దపల్లి, ప్రజానావ :** ఇంటి ముందు నిలిపిన ట్రాక్టర్‌ను తాత రివర్స్ తీస్తుండగా, టైర్ల కింద పడి మనుమడు మృతి చెందిన ఘటన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తిలో జరిగింది. ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మ్యాన భవాని- ఓంకార్ దంపతులకు ఏకైక కొడుకు వేదాన్ష్(4) ఉన్నాడు. వారి ఇంటి ముందు నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను గురువారం బాలుడి తాత మ్యాన ప్రభాకర్ స్టార్ట్ చేశాడు. కొంతదూరం ముందుకు తీసుకెళ్లిన తర్వాత వెనక్కి తిప్పాడు. ఈ క్రమంలో వేదాన్ష్ ఇంట్లో నుంచి ఒక్కసారిగా పరుగెత్తి ట్రాక్టర్ వెనుకవైపు చేరాడు. ప్రభాకర్ గమనించకపోవడంతో టైర్ల కింద పడ్డాడు. తలకు తీవ్రమైన గాయమై అపస్మారక స్థితిలోకి చేరాడు. కుటుంబ సభ్యులు వెంటనే పెద్దపల్లిలోని దవాఖాకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, తాత కన్నీరు మున్నీరయ్యారు. తండ్రి ఓంకార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గవర్నర్ జస్టిస్ నజీర్‌తో ఎన్నికల అధికారుల భేటీ

**కొత్తగా ఎన్నికైనా ఎమ్మెల్యేల జాబితా అందచేత**



**అమరావతి, ప్రజానావ:** రాష్ట్ర శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్ జస్టిస్ నజీర్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అందచేశారు. ఈ మేరకు మీనా నేతృత్వంలో భారత ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాష్ కుమార్, అదనపు సీఈవోలు పి. కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్, కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజరు కుమార్, జాయింట్ సీఈవో ఎ.వెంకటేశ్వరరావు, సెక్షన్ ఆఫీసర్ రవీందర్ కుమార్ తదితరులు గురువారం రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కలిసారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులుగా జాబితాను అందజేశారు. ఏపీ అసెంబ్లీని రద్దు చేస్తూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆర్టికల్ 174 ప్రకారం మంత్రివర్గం సిఫార్సు మేరకు ఏపీ శాసనసభను రద్దు చేస్తూ నోటిఫికేషన్ విడుదలైంది. ఏపీలో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. టిడిపి 135, జనసేన 21, బిజెపి 8 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందాయి. వైకాపా 11 స్థానాల్లో విజయం సాధించింది. దీంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# ఢిల్లీలో తీవ్రమైన నీటి సమస్య



**న్యూఢిల్లీ, మే 6 :** దేశ రాజధాని ఢిల్లీని తీవ్రమైన నీటి సంక్షోభం వెంటాడుతోంది. అక్కడి ప్రజలు నీటి చుక్క కోసం ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ నీటి సంక్షోభాన్ని తీర్చడానికి యమునా మిగులు నీటిని విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఆదేశించింది. ఢిల్లీకి అదనపు నీటిని అందించాలని హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీకి హిమాచల్‌ప్రదేశ్ ఇస్తున్న నీటి వివరాలను కోర్టుకు ఇవ్వాలని ఎగువ యమునా నదిబోర్డును ఆదేశించింది. మరోవైపు నీరు వృధా కాకుండా చేరసుకోవాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని కోరింది. ఢిల్లీలో నీటి సమస్య మరింత తీవ్రమైంది. తాగు నీటి కోసం మూడు, నాలుగు నెలలుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంజయ్ క్యాంప్ సహా చాలా కాలనీలు, బస్తీల్లో నీటి కరువు నెలకొంది. తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ట్యాంకర్లు రాగానే దాని వెంట ఉరుకులు, పరుగులు పెడుతున్నారు ప్రజలు. ఎండాకాలం ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి ఉంది. భూగర్భ జలాలు అడుగంటడం కూడా నీటి కరువుకు ప్రధాన కారణమైంది. ట్యాంకర్లు వచ్చినా...అవి సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు. తాగు నీటి కోసం తాము, తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు. తక్షణమే తమకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జూన్ 7వ తేదీన 137 క్యూసెక్కుల యమునా మిగులు నీటిని హర్యానాలోని హథినికుండ్ బ్యారేజికి విడుదల చేయాలని సుప్రీం ఆదేశించింది. హథినీకుండ్ బ్యారేజికి విడుదలైన నీటిని నేరుగా ఢిల్లీలోని వజీరాబాద్‌కు విడుదల చేయాలని జస్టిస్ పికె మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ విషయంలో ఢిల్లీ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలు సోమవారం లోగా సమ్మతి అఫడవిట్‌లను దాఖలు చేయాలని సుప్రీం కోరింది. కాగా, నీటి కొరతను తీర్చేందుకు గాను యమునా నది మిగులు జలాలను విడుదల చేసే విధంగా హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వాలను ఆదేశించాలని ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జిస్టిస్ మిశ్రా బెంచ్ విచారించింది. ఈమేరకు హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాలను సుప్రీం ఆదేశించింది.

# మేడిగడ్డలో కొనసాగుతున్న గ్రౌటింగ్ పనులు

**జయశంకర్ భూపాలపల్లి, ప్రజానావ:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో ఉన్న మేడిగడ్డ లక్ష్మి బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 18, 19 పియర్ల వద్ద ఇటీవల చేపట్టిన గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయి. గ్రౌటింగ్ యంత్రాల సాయంతో బరాజ్‌లో మొత్తం 85 గేట్లకు గాను గతంలో 78 గేట్లు ఎత్తివేయగా, దెబ్బతిన్న పియర్ల వద్ద ఉన్న 20, 21 గేట్లు ఎత్తేందుకు వీలుకాకపోవడంతో ఆర్క్ గ్రౌగింగ్ పరికరంతో కట్ చేసే పనులు జరుగుతున్నాయి. ఏడో బ్లాక్‌లో 16వ గేట్ ఎత్తగా, 17 గేటు ఎత్తేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్‌డీఏఎస్ సూచన మేరకు మరమ్మతు పనులు చేపడుతున్నారు. బరాజ్‌లో లోపాలపై అధ్యయనం చేయడానికి బుధవారం వచ్చిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం సభ్యుల పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ బృందం మరోవారం రోజులపాటు బరాజ్‌లో లోపాలపై పలు రకాల శాంపిల్స్‌ను సేకరించి క్షేత్ర స్థాయిలో పరిశీలన, పరీక్షలు చేయనున్నట్లు తెలిసింది. బరాజ్ దిగువన నీటి ప్రవాహానికి పియర్ల చుట్టూ ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా యంత్రాల సాయంతో షీట్‌ఫైల్స్ అమర్చుతున్నారు. డౌన్, అప్ స్ట్రీమ్‌లో సీసీ బ్లాక్‌లను తీసి అమర్చుతున్నారు.




# తెలంగాణ వ్యాప్తంగా బడిబాట ప్రారంభం

**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి బడిబాట ప్రారంభ మైంది. జూన్ 19వరకు కొనసాగనున్న బడిబాటలో భాగంగా.. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే సర్కార్ లక్ష్యంగా పెట్టు కుంది. ప్రభుత్వ స్కూళ్లలో చదివితే వచ్చే వి ద్యా, అవకాశాలపై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించనున్నారు. బడిబాట ప్రోగ్రాంలో భాగంగా జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి స్కూళ్లను పున:ప్రారంభిం చనున్నారు. పాఠశా లల రీ ఓపెన్ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించనున్నారు సీఎం, మంత్రులు. రాష్ట్రవ్యాప్తంగా 26వేల ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

# ప్రక్షాళన దిశగా బీజేపీ

**• పార్టీ అధ్యక్షుడు నడ్డాను తప్పించే యత్నం • కొత్త అధ్యక్షుడి రేసులో శివరాజ్‌సింగ్ చౌహాన్?**



**న్యూఢిల్లీ, మే 6 :** లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి అనుకున్న మేర ఫలితాలు రాకపోవడంతో పార్టీని ప్రక్షాళన చేసే దిశగా ఆలోచన చేస్తోంది. ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు నడ్డ పదవీ కాలం ముగిసింది. ఎన్నికల ముందు అధ్యక్షుడి పదవీ కాలాన్ని పొడిగించారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడి మార్పు తథ్యమంటూ చర్చ లేచింది. ఇందులో భాగంగా బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను తప్పించి ఆ స్థానంలో మరో సీనియర్ నేతకు అవకాశం ఇవ్వాలని అనుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతలకు అవకాశం ఇచ్చే సూచనలు ఉన్నాయి. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి సుదీర్ఘ కాలం సిఎంగా పని చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్‌కు పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఆయన్నే పార్టీ అధ్యక్ష పదవి వరించనన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఘన విజయం సాధించి రాష్ట్రంలో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ అధిష్టానం కొన్ని నెలల క్రితం శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించింది. నూతన ముఖ్యమంత్రిగా మోహన్ యాదవ్ నియమితులయ్యారు. అయితే చౌహాన్ బీజేపీ సీఎంగా16 ఏళ్లకుపైగా పనిచేశారు. ఆయన్ని సీఎం పదవి నుంచి తొలగించినప్పటి నుంచి కొంత అసంతృప్తితో ఉన్నారు. తాజా ఎన్నికల్లో ఆయన ఎంపిగా గెలిచారు. దీంతో ఆయన్ని అధిష్టానం ఢిల్లీకి పిలిపించడంతో అధ్యక్ష పదవి ఆయన్ని వరించబోతోందనే చర్చ నడుస్తోంది. ఆయనతో పాటు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని సైతం అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. లోక్ సభ ఎన్నికల్లో విదిషా నుంచి పోటీ చేసిన చౌహాన్ సమీప కాంగ్రెస్ అభ్యర్థిపై 8,21,408 మెజారిటీతో గెలుపొందారు. ఆయనకు11,16,460 ఓట్లు రాగా, రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మ 2,95,052 ఓట్లతో సరిపెట్టుకున్నారు.

# 17నుంచి అమ్మవారి తెప్పోత్సవాలు

## ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ప్రకటన

**తిరుపతి, ప్రజానావ:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల సందర్భంగా ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. జూన్ 17 నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు తెప్పోత్సవాలు జరుగనున్నాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారు పద్మసరోవరంలో తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. జూన్ 17న మొదటి రోజు రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి, రెండో రోజు సుందరరాజ స్వామి, చివరి మూడు రోజులు శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పలపై విహరిస్తారని వెల్లడించారు. జూన్ 20న రాత్రి 8.30 గంటలకు గజవాహనం, 21న రాత్రి 8.30 గంటలకు గరుడ వాహనసేవను ఘనంగా నిర్వహించనున్నామని వివరించారు. ఈ సందర్భంగా ఐదు రోజుల పాటు కల్యాణోత్సవం , ఊంజల్‌సేవ, జూన్ 21న లక్ష్మీ పూజను రద్దు చేశామని పేర్కొన్నారు.



## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందే చూసుకోవాలి
- ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి

**సిరిసిల్ల, ప్రజానావ:** ఈ నెల 9 వ తేదీన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని టీజీపీఎస్సీ ఛైర్మెన్ మహేందర్ రెడ్డి సూచించారు. ఈ నెల 9 వ తేదీన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణపై హైదరాబాద్ లోని టీజీపీఎస్సీ కార్యాలయం నుంచి చైర్మెన్ మహేందర్ రెడ్డి అన్ని జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, అడిషనల్ ఎస్పీలు, రీజినల్ కో ఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మెన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాన్నం 1.00 గంట వరకు కొనసాగే గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1000 సెంటర్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ పరీక్షకు దాదాపు 4 లక్షలకు పైగా మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. టీజీపీఎస్సీ నుంచి వచ్చే పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జాగ్రత్తగా భద్రపర చాలని, కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఉండాలని, పోలీసుల బందోబస్తు ఏర్పాటు చే యాలని సూచించారు. పరీక్ష నిర్వహించే రోజున పోలీస్ బందో బస్తు మధ్య పరీక్ష పేపర్ల ను తరలించాలని, పూర్తి అయిన తర్వాత అలా గే వాటిని తిరిగి పంపాలని ఆదేశించారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవ రూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకె ళ్లవద్దని స్పష్టం చేశారు. పరీక్ష విధులు నిర్వర్తిం చే అబ్జర్వర్, రూట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని, ఈ మేరకు పోలీస్ సిబ్బం దిని నియమించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరా లో ఎలాంటి లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరీక్షలకు ఏర్పాటు చేయాలని సూచించారు. అందరూ కలిసి సమన్వయంతో పరీక్షను విజయ వంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

### జిల్లాలో 15 కేంద్రాలు

జిల్లాలో 4699 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్, నోడల్ ఆఫీసర్ పూజారి గౌతమి తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా నెలకొల్పిన కంట్రోల్ రూమ్ 9398684240 నెంబర్ కు ఫోన్ చేయవచ్చని సూచించారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రంవద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

### ముందుగానే చేరుకోవాలి

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ఒక రోజు ముందే చూసుకోవాలని అదనపు కలెక్టర్, నోడల్ ఆఫీసర్ పూజారి గౌతమి సూచించారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 9.00 గంటల వరకు కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఉదయం 10.00 గంటల తర్వాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ డా. వడ్లూరి శ్రీనివాస్, పర్యవేక్షకులు వేణు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా

**సిరిసిల్ల, ప్రజానావ:** సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో బీఆర్ఎస్ హవా కొనసాగింది. పార్టీలకతీతంగా ఎన్నికలు అయినప్పటికీ అభ్యర్థులకు ఆయా పార్టీల మద్దతుతో గురువారం ఎన్నికలు కొనసాగాయి. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను ఎన్నికల్లో నిలపడంతో హొరాహోరిగా సాగాయి. మొత్తం 12 మంది డైరెక్టర్ స్థానాల కు ఎన్నికలు జరగ్గా, బీఆర్ఎస్ మద్దతుదారులు మెజారిటీ స్థానాలను గెలుచుకొని సహకార అర్బన్ బ్యాంకు పీఠాన్ని కైవసం చేసుకున్నారు. గెలిచిన వారిలో రాపెల్లి లక్ష్మీనారాయణ, గుడ్ల సత్యానంద్, చొప్పదండి ప్రమోద్, అడగట్ల మురళి, పాటి కుమార్ రాజ్, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాస్, శంకర్, హరిణి, సురేశ్, సంజీవ్‌లు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి



**సారంగాపూర్, ప్రజానావ:** నిత్యం ప్రజాసేవ కోసమే పరితపిస్తామని, ప్రజా సమస్యల పరిస్కారమే మా లక్ష్యం అని బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అల్లూరి మల్లా రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం ఇప్పచెల్మా, పెండల్ దారి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఆరా తీశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కారం చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంబరి గంగాధర్, అట్లా పోతరెడ్డి, భీమ్‌రావు, భోజన్న తదితరులున్నారు.

## పిడుగుపాటుతో మహిళ మృతి

**వెల్దండ, ప్రజానావ:** పిడుగుపాటుతో గుర్రై మహిళ మృతి ఘటన నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జంగమ్మ(38) అనే మహిళ తన వ్యవసాయ పొలంలో భర్త, తల్లితో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. దీంతో చెట్టు కిందకు వెళ్లడంతో అంతలోనే పిడుగుపడి మహిళ మృతి చెందింది.

**పిడుగుపాటుతో యువరైతు మృతి**

నిర్మల్, ప్రజానావ: నిర్మల్ జిల్లా దిలావార్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో మూడపెల్లి ప్రవీణ్ (28) అనే యువ రైతు పిడుగుపాటుకు గుర్రై మృతి చెందాడు. గురువారం తన పంట చేనులో వ్యవసాయ పనులకు ప్రవీణ్ వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగు పడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రవీణ్ మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ఏడాది కూతురు ఉన్నారు.

**ఐదు మేకలు, ఒక గొర్రె మృతి**

పిడుగుపాటుతో ఐదు మేకలు ఒక గొర్రె మృతి చెందిన సంఘటన కడెం మండలం అంబర్‌పేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జింక వెంకటేశ్ గురువారం తన మేకల మందను మేపడానికి గ్రామ సమీపానికి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా పిడుగు పాటుకు గుర్రై ఐదు మేకలు, ఒక గొర్రె మృతి చెందాయి. మరో రెండు మేకలు గాయపడినట్టు బాధితుడు వివరించారు. మృతి చెందిన మేకలు, గొర్రెల విలువ రూ. 80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వపరంగా ఆదుకోవాలంటూ వెంకటేశ్ కన్నీరుమున్నీరయ్యాడు.


# ఆధారాలతో ఫిర్యాదు చేసినా అలసత్వమే!

- వట్టినాగులపల్లిలో కబ్జాల పర్వం
- ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- ఫోన్ చేసినా స్పందించని ఎమ్మార్వో
- వాటి జోలికి మేం వెళ్లాం
- కావాలంటే కూల్చినవే మళ్లీ నిర్మిస్తే కూలుస్తాం: ఆర్ఐ
- మీరొస్తేనే మేమొస్తాం: వీఆర్వో





**గండిపేట్, ప్రజానావ:** రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం వట్టినాగులపల్లి గ్రామం ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతోంది. ఇప్పటికే ఈ భూమిలో కబ్జారాయుళ్లు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను చేపట్టగా, మరికొందరు ప్లాట్ల లెక్కన అమ్మకాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక దీనిపై 'ప్రజానావ' దినపత్రిక గత నెల 15న ఆధారాలతో సహా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, సీసీఎల్ఏలో ఫిర్యాదు చేయగా, అదే నెలలో 20వ తేదీరోజు గండిపేట రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆర్ఐ విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. అయితే పదుల సంఖ్యలో అక్రమ కట్టడాలున్నా రెవెన్యూ అధికారులు మాత్రం ముందున్న రెండు, మూడు ఇళ్లనే నామమాత్రంగా కూల్చి చేతులు దులుపుకున్నారు. అధికారులు కూల్చిన మూడింట్లో రెండింటిని పూర్తిగా కూల్చగా, ఒక నిర్మాణం ముందు భాగాన్నే కూల్చివేశారు. దీంతో ఇప్పుడు సదరు అక్రమ కట్టడానికి సంబంధించిన యజమాని తిరిగి పూర్తి నిర్మాణం చేపట్టడం విశేషం. ఇదే విషయమై గండిపేట్ ఎమ్మార్వోను 'ప్రజానావ' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించగా, ఆధారాలుంటే వాట్సాప్ చేయాలని కోరారు. తీరా వాట్సాప్ చేస్తే ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. అయినా ప్రయత్నం మానని 'ప్రజానావ' ప్రతినిధి ఆర్ఐతో మాట్లాడి వాట్సాప్ లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి ఫొటోలతో సహా పూర్తి సమాచారం ఇవ్వగా, ఉన్నతాధికారులు చెప్పనిదే వాటి జోలికి వెళ్లమని స్పష్టం చేశారు. అయితే తాము కూల్చిన నిర్మాణాలు తిరిగి నిర్మిస్తే ఫొటోలు పంపాలని కోరారు. ఆర్ఐ చెప్పిన విధంగానే కూల్చిన చోట నిర్మాణాలకు సంబంధించి ఫొటోలు పంపితే ఈ విషయ–ంమై వీఆర్వో మాట్లాడతారని పేర్కొన్నారు. ఇక వీఆర్వోను సంప్రదించి ఫొటోలతో సహా ఆధారాలు పంపితే మీరు అక్కడి వస్తేనే మా అధికారులను పంపిస్తామంటూ తిరకాసు పెట్టడం గమనార్హం. ఇక అన్ని ఆధారాలిచ్చి ప్రభుత్వ భూమిని కాపాడమని కోరితే రెవెన్యూ అధికారుల తీరు ఇలా ఉండడం బాధాకరం. అధికారులు చేయాల్సిన పనిని ఓ పత్రిక చేసి ఆధారాలిచ్చినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.




### 60 గజాల చొప్పున 310 పట్టాలు..

2006లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్వే నెం. 128/2, 129/1, 129/3లో 60 గజాల చొప్పున 310 మందికి ఇండ్ల స్థలాల కోసం పట్టాలిచ్చింది. ధరణి రికార్డు ప్రకారం దాదాపు 30 ఎకరాలు ఉన్న ఈ ప్రభుత్వ స్థలంలో ఇంచుమించు నాలుగెకరాల వరకు లబ్ధిదారులకు వెళ్లగా, మిగిలిన స్థలమంతా ప్రభుత్వం ఆధీనంలోనే ఉండాలి. అయితే తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు భూముల ధరలు ఒక్కసారిగా పెరగడంతో కొందరు బడాబాబులు, రియల్టర్ల కన్ను ఇక్కడి ప్రభుత్వ భూమిపై పడింది. ఇంకేముంది అనుకున్నదే తడావుగా కబ్జాల పర్వం మొదలుపెట్టారు. కొందరు ఈ భూముల్లలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతుండగా, మరికొందరు ఏకంగా 120 గజాల చొప్పును అక్రమ లేఅవుట్లు వేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటికే 'ప్రజానావ' ప్రతినిధితో పాటు పలువురు ఈ ఆక్రమాణాలపై ఫిర్యాదు చేస్తే రెవెన్యూ అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా 'మామూలు'గా తీసుకుంటారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి, ప్రభుత్వ స్థలంలో అమ్మకాలు చేపట్టిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలయాలు లేదా విద్యాసంస్థలు, ప్రభుత్వాస్పత్రుల నిర్మాణాలకు వాడుకోవాలని స్థానికులు సైతం కోరుతున్నారు.


ఇటీవల అధికారులు కూల్చివేయగా, పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టిన దృశ్యం



## అధికారులను పాత స్థానాలకే బదిలీ చేయండి

### భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసిన ట్రెసా నేతలు



**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా బదిలీ చేసిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలు, స్థానాలకు బదిలి చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) అధ్యక్షుడు వీ.రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.గౌతమ్ కుమార్ గురువారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సొంత జిల్లాలో పనిచేస్తున్న, మూడేళ్ల కన్నా ఎక్కువగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను డిప్యూటేషన్‌పై సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం జరిగిందని నవీన్ మిట్టల్ దృష్టికి తీసుకొచ్చారు. గత కొన్ని నెలలుగా రాత్రింభవళ్లు విరామం లేకుండా రెవెన్యూ ఉద్యోగులు కుటుంబాలకు దూరంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని, ఎన్నో ఇబ్బందుల నడుమ ఉద్యోగులు విజయవంతంగా ఎన్నికల విధులు నిర్వహించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలోనూ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే తహసీల్దార్లను తిరిగి పూర్వపు జిల్లాలు, స్థానాలకు బదిలీ చేసే అనవాయితీ కొనసాగుతున్నదని గుర్తుచేశారు. ఎన్నికల ప్రకియ ముగిసినందున ఎన్నికల దృష్ట్యా బదిలీ చేసిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లను తిరిగి పాత స్థానాలకే బదిలీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ విజయవంతంగా ఎన్నికలు నిర్వహించిన రెవెన్యూరీ ఉద్యోగులందరికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడి తహసీల్దార్ల బదిలీలు చేస్తామని వారికి తెలిపారు. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్‌ను కలిసిన వారిలో ట్రెసా ఉపాధ్యక్షుడు కే.నిరంజన్ రావు తదితరులున్నారు.



ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ని ఫిలింనగర్ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫిల్మ్ నగర్ 18 బస్తీల అభివృద్ధిలో మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా మొదలుపెట్టాలని కోరారు. అనంతరం ఫిల్మ్‌నగర్‌లోని పలు సమస్యలపై చర్చలు జరపగా, ఎమ్మెల్యే దానం నాగేందర్ సానుకూలంగా స్పందించి అభివృద్ధిలో ఆలస్యం లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జీ.నగేశ్, సాగర్, అబ్దుల్, గని, ఆకుల రాజు, కాటూరి రమేశ్, సంపంగి కిరణ్, వీరేశ్, నక్క రాము, సత్యనారాయణతో పాటు దయ్యాల దాసు ఉన్నారు. – ఖైరతాబాద్, ప్రజానావ

## బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్, రిమాండ్

**చందుర్తి, ప్రజానావ:** రైతును బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడిన రిపోర్టర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన కమటం లక్ష్మీరాజ్యం అనే రైతును అదే గ్రామానికి చెందిన ఇండియా టీవీ తెలుగు ఛానల్ రిపోర్టర్ గొంటి గణేశ్ (ఏ1) ఇటీవల బెదిరించి రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రిపోర్టర్ గణేశ్‌ని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్ తెలిపారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ సెంటర్) చీఫ్ జనరల్ మేనేజర్ మంజు శర్మ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోడె మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేసి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, కాంచనపల్లి నటరాజు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. – వేములవాడ, ప్రజానావ

## బడి బాట

### (బాల గేయం)


బడి తాళం తీసారు
బడికి బాట వేసారు
బస్సు వచ్చే వేళాయే
త్వరపడండి బాలలూ

పుస్తకాలు చక్కగా
బ్యాగ్ లో పెట్టుకుని
స్కూల్ డ్రెస్ వేసుకుని
త్వరపడండి బాలలూ

హాలిడే వర్క్ చేసారా
హెూమ్ వర్క్ చేసారా
అన్నీ సరిగా చూసుకుని
త్వరపడండి బాలలూ

అమ్మా నాన్న చెప్పినట్టు
స్కూల్ టీచర్లు చెప్పినట్టు
బుద్ధిగా చదువుకునేందుకు
త్వరపడండి బాలలూ

ఆటల్లో చదువుల్లో
గొప్పగా రాణించేందుకు
బడిబాట పట్టండి
త్వరపడండి బాలలూ



– మిత్రాజీ
ప్రభాకర్‌రావు గుండవరం, అత్వెల్లి, మేడ్చల్ )
ఫోన్ నం. 9949267638




# నిబంధనల ప్రకారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణ

- వానాకాలం పంటకు సమృద్ధిగా ఎరువులు, విత్తనాలు
- నకిలీ విత్తనాల విక్రయం పై కఠిన చర్యలు
- రైతులు లైసెన్సుడ్ డీలర్ల వద్ద నుంచి విత్తనాలను కొనుగోలు చేయాలి
- తాగ నీటి సరఫరా ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- మిషన్ భగీరథ తాగునీటి సరఫరా స్థితిగతులపై నివేదిక రూపొందించాలి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**సిరిసిల్ల, ప్రజానావ :** జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిబంధనల ప్రకారం పక్కగా నిర్వహిం చాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సంబం ధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ లోని డా. బీ.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహ ణ, వానాకాలం పంట సీజన్ విత్తనాలు, ఎరువుల లభ్య త, మిషన్ భగీరథ తాగునీటి కనెక్షన్ల సర్వే, స్కూల్ యూ నిఫాంలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పి.గౌతమి, ఖీమ్యా నాయక్‌లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం నుంచి పరీక్షా కేంద్రానికి ప్రశ్నా పత్రాలు, తిరిగి పరీక్షా కేంద్రం నుంచి జవాబు పత్రాలు రిసెప్షన్ సెంటర్ కు తరలించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, స్ట్రాంగ్ రూమ్ నుంచి పోలీస్ బందోబస్తుతో తీసుకొని వెళ్ళి పరీక్షా కేంద్రాల్లోని లైజనింగ్ అధికారులకు అందజేయాలని, రిసెప్షన్ సెంటర్ లో టీజీఎస్‌పీఎస్‌సీ అధికారులకు అందజేయాలని ఆదేశిం చారు. ప్రశ్న పత్రాలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ లను సన్నద్ధం చేయాలని, శుక్రవారం జిల్లాలకు ముఖ్యమైన సామాగ్రి, ప్రశ్న పత్రాలు చేరుకుంటాయని, వాటిని భద్ర పరిచేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పరీక్ష కేంద్రం పరిసరాలు 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రం సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను పూర్తిస్థాయిలో మూసివేయాలని సీఎస్ సూచించారు.

## విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావొద్దు

వానాకాలం పంట సీజన్ ప్రారంభమవుతుందని, రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువుల స్టాక్ మన రాష్ట్రంలో ప్రతి జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, వాటి పంపిణీలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. రాబోయే 20 నుంచి 25 రోజుల వ్యవధిలో చాలా వరకు రైతులు విత్తనాల కొనుగోలు చేస్తారని, ఈ సమయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ నకిలీ విత్తనాలను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ నకిలి విత్తనాలు ఎక్కడా విక్రయించకుండా చూడాలని, నకిలి విత్తనాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం గుర్తించిన లైసెన్స్ విత్తన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు రశీదు తీసుకోవాలని, సీల్డ్ ప్యాకెట్లను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని విస్తృతంగా ప్రచారం చేయాలని సీఎస్ సూచించారు. ప్రతి రైతు వారీగా అవసరమైన విత్తనాల పై రిజిస్టర్ నిర్వహించాలని అన్నారు. వానకాలం ప్రారంభమవుతున్న నేపథ్యం లో రైతులకు అవసరమయ్యే పచ్చి రొట్టె విత్తనాలు సైతం అందుబాటులో ఉంచాలని, వరి సన్న రకాల విత్తనాల స్టాక్‌లు, పత్తి విత్తనాలలో అధికంగా ఉంచాలని తెలిపారు. పత్తి విత్తనాలను రైతులకు అవసర మైన మేర అందుబా టులో ఉంచాలని, రైతుల కు అవసరమైన రకాల విత్తనాలు అందుబాటు లో లేని పక్షంలో త్వరితగతిన సదరు విత్తనాల స్టాక్ మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మంచి విత్తనాలు రైతు లు వినియోగించాలని సూచించారు. జిల్లాలో ముందుగా ఎక్కడ వ్యవసాయ పనులు ప్రారంభమవుతుందో, ఎక్కడా నాట్లు వేస్తారో ఆ ప్రాంతాలలో ఎరువులు, విత్తనాలు అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని, ఎక్కడ రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. నకిలీ విత్తనాల గురించి సమాచారం అందితే వెంటనే మీడియా ద్వారా రైతులను అప్రమత్తం చేయాలని, నకిలీ విత్తనాలను విక్రయిస్తున్న వారి పై పిడి యాక్ట్ కింద కేసులో నమోదు చేయాలని సదరు సమాచారాన్ని సైతం మీడియాకు ఎప్పటికప్పుడు అందించాలని సీఎస్ సూచించారు. వానాకాలం సాగులో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు నిపుణుల ద్వారా అందచేందుకు రైతు నేస్తం కార్యక్రమం క్రింద రైతు వేదికల వద్ద ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టం పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు.

## ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా కావాలి

వేసవికాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా తాగునీటిని అందించడంలో అధికారులు సఫలీకృతులయ్యారని, ఇదే స్ఫూర్తితో రాబోయే 20 రోజులలో సైతం అప్రమత్తంగా ఉంటూ ప్రతి ఇంటికి త్రాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీటి సరఫరాను జిల్లా స్థాయిలో నిరం తరం పర్యవేక్షించాలని , ప్రతి ఇంటికి సరిపడా తాగునీరు సకాలంలో సరఫరా అయ్యేందుకు అవసరమైన చర్యలు కట్టుదిట్టంగా తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథ తాగునీటి సర్ఫ్రా పై సర్వే నిర్వహించి నివేదికను సమర్పించాలని సీఎస్ సూచించా రు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటి సందర్శించి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా స్థితి గతుల పరిశీలించి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని సమర్పించా లని సీఎస్ పేర్కొన్నారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రభుత్వం నిషేధించిందని, దీనిని క్షేత్రస్థాయిలో కట్టుదిట్టంగా అమలు చేయాలని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ప్రత్యామ్నాయక బట్ట సంచుల వినియోగాన్ని ప్రోత్సహించా లని సీఎస్ పేర్కొన్నారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూలు యూనిఫామ్ కుట్టించి అందజేయాలని సీఎస్ ఆదేశించారు.

## 897 కేంద్రాల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

టీఎస్పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్లను నిర్వహించాలని, రాష్ట్రవ్యా ప్తంగా దాదాపు 897 పరీక్ష కేంద్రాల్లో 4.3 లక్షలకు పైగా అభ్యర్థులు ప్రిలిమ్స్ పరీక్ష రాయడం జరుగుతుందని, పరీక్ష సజావుగా నిర్వహించేందుకు కొత్తగా సీనియర్ అధ్యాప కులను, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ ను రీజినల్ కోఆర్డినే టర్లుగా నియమిస్తున్నామని అన్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో 4699 మంది అభ్యర్థులు గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష రాయడం కోసం 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశా మని తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే, జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ 9398684240 నెంబర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# ఒక్కటే కూల్చిన్రు!

- ఇంకొదాన్ని టచ్ కూడా చేయలే!
- వదిలేసిన అక్రమ కట్టడం వెనుక పెద్దల హస్తం?
- అక్రమ నిర్మాణాల కూల్చివేతలోనూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



**ఖైరతాబాద్, ప్రజానావ:** షేక్‌పేట మండల పరిధిలో ఇటీవల ఎన్నికల సమయంలో జోరుగా భూకబ్జాలు పెరిగాయి. ఇదే అదనుగా భావించిన కొందరు షేక్‌పేట్ పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్ ఫిల్మ్ నగర్ లోని వినాయక్ నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. దీనికి సంబంధించి 'ప్రజానావ' దినపత్రిక గతంలోనే పలు కథనాలను ప్రచురించింది. అయితే ప్రస్తుతం ఎన్నికల ఫలితాలు కూడా ముగియడంతో కబ్జాలపై అధికారులు ఉక్కుపాదం మోపారు. గురువారం పోలీసులతో వచ్చి ఓ అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇక్కడ రెండు అక్రమ నిర్మాణాలు నిర్మించగా, పదుల సంఖ్యలు నిర్మాణాలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. అయితే అధికారులు వచ్చి నిర్మించిన రెండు అక్రమ కట్టడాలు కూల్చకుండా ఒకదాన్ని మాత్రమే పూర్తిగా కూల్చి మిగతా నిర్మాణంవైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు రేకెత్తిస్తోంది. ఇదే విషయంపై స్థానికులు రెవెన్యూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ కట్టడాలను కూల్చడంలోనూ ఏకపక్షంగా వ్యవహరించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని మండిపడుతున్నారు. ఇదిలాఉంటే అధికారులు కూల్చని అక్రమ కట్టడం వెనుక పెద్దల హస్తం ఉందని, ఓ బడా నేత మెప్పు పొందేందుకే అధికారులు ఆ నిర్మాణం వైపు కనీసం కన్నెత్తి చూడలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఇదే విషయమై స్థానికులు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ కట్టడం నిర్మిస్తే వదిలేయడం ఏంటని.. అందరికీ ఒకే న్యాయం ఉండాలన్నారు. బడా నేతలు, పెద్దలైతే కబ్జా చేసుకోవాచ్చా అని నిలదీస్తున్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి మిగిలిన ఒక అక్రమ కట్టడాన్ని సైతం కూల్చివేయాలని, దీనిపై ఉన్నతాధికారులు సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వినాయక్ నగర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ప్రదేశంలో కళాశాలతో పాటు ప్రభుత్వాస్పత్రి నిర్మించాలని స్థానికులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అలాగే ఇల్లులేని పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లను ఈ ప్రభుత్వ స్థలంలో నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.




ప్రజానావ
ఐ డోంట్ కేర్!


ఎలక్షన్ ముందు
ఎలక్షన్ తరువాత
వాట్ ఏ ఐడియా!

అక్రమ కట్టడాలపై ప్రజానావ ప్రచురించిన కథనాలు

## మహిళలు, యువతులు నిర్భయంగా పోలీసులను సంప్రదించండి

- పని ప్రదేశాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ బృందం
- మహిళలను వేధిస్తున్న పోకిరీలపై కేసులు



**సిరిసిల్ల, ప్రజానావ:** మహిళలు, బాలికలు, విద్యార్థినిలు వేధింపులకు గురైతే వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 లేదా డయల్ 100 కు పిర్యాదు చేస్తే నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం జిల్లాలో షీ టీమ్స్ బృందాలు కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో, షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్‌లపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గత నెలలో షీ టీమ్‌కు వచ్చిన ఫిర్యాదులలో 3 ఎఫ్ఐఆర్‌లు, 4 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని ఎస్పీ తెలిపారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలని మహిళల భద్రత, ఆకతాయిల వేధింపుల నుంచి మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పోలీస్ శాఖ మహిళా భద్రతకు కోసం జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ఏర్పాటు చేసి ఎన్నోరకాల కార్యక్రమాలు చేపడుతూ విద్యార్థినులు, యువతులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ నిరంతరం వారికి అందుబాటులో ఉంటున్నదని చెప్పారు. మహిళలు ముఖ్యంగా సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్ స్టాగ్రామ్ ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్నిరకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా సంప్రదించాలని, నేరుగా సంప్రదించలేని వారు షీ టీమ్ నంబర్ 87126 56425 డయల్ 100 కు సమాచారమిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచడతాయని ఎస్పీ తెలిపారు.

## అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

**వరంగల్, ప్రజానావ:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాలలో అప్పుల బాధతో బుధవారం ఓ కౌలు రైతు ఆత్మహత్యకు చేసుకున్నాడు. కొమ్మాలకు చెందిన గడ్డమీది అశోక్ (43) రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకొని ఐదేళ్లుగా సాగుచేస్తున్నాడు. ఆశించిన దిగుబడులు రాక, రూ.6 లక్షల వరకూ అప్పులు కావడంతో మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్ద పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కాగా అశోక్ కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

## దొంగతనం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

**సిరిసిల్ల, ప్రజానావ:** దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.వంద జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన గురువారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ రఘుపతి తెలిపారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ సర్దార్ నగర్‌కు చెందిన బొట్ల వెంకటస్వామి అనే వ్యక్తికి రగుడు శివారులో ఉన్న భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి దానికి గేటును అమర్చగా, ప్రహరీ గేటును గతేడాది ఆగస్టు 3న దొంగతనం చేశారు. దీంతో బాధితుడు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి గేటు దొంగతనం చేసిన సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌కు చెందిన గూడూరి కిరణ్, మెహర్ నగర్‌కు చెందిన షేక్ రియాజ్ పాషా అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు. విచారణ అధికారి ఎస్ఐ మల్లేశం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున చెలుమల సందీప్ కుమార్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కావేటి సృజన నేరస్తులు గూడూరి కిరణ్ కుమార్ , షేక్ రియాజ్ పాషాలకు ఒక సంవత్సరం కఠిన కారాగార జైలు శిక్షతో పాటు రూ.వంద జరిమానా విదించడం జరిగిందని చెప్పారు.

## భూకబ్జాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

**వేములవాడ, ప్రజానావ:** భూ కబ్జాలు చేస్తూ అక్రమ లేఔట్లు సృష్టించి అమ్మడం, అనుమతి లేకుండా ప్లాట్స్ చేసి అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేశ్ అనే వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ రు మాట్లాడుతూ.. వేములవాడ పట్టణం చంద్రగిరి గ్రామ పరిధిలోని తెట్టేకుంటకి చెందిన చెన్నమనేని వెంకటేశ్వర్లు వద్ద సిరిసిల్ల పట్టణానికి చెందిన సిరిగిరి రమేశ్ అనే వ్యక్తి సమారు రెండెకరాల భూమి కొనుగోలు చేశాడు. అతని వృద్ధాప్యాన్ని ఆసరాగా తీసుకొని అసలు ఉనికిలో లేని ప్లాట్లను సృష్టించడమే కాకుండా, చెన్నమనేని వెంకటేశ్వర్లు పక్కన ఉన్న చెన్నమనేని జగన్మోహన్ భూమిలోకి అక్రమంగా చొరబడి రోడ్డుగా ఉన్న భూమిని లే అవుట్ చేసి అమ్మాడు. పర్మిషన్ లేకుండా ప్లాట్స్ చేసి అమాయక ప్రజలకు అమ్మడమే కాకుండా, మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నాడనే ఫిర్యాదుల మేరకు సిరిగిరి రమేశ్‌పై వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్ కి తరలించినట్లు పట్టణ సీఐ తెలిపారు. సిరిగిరి రమేశ్ చేతిలో మోసపో యిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సీఐ వీరప్రసాద్ సూచించారు.

## నీవే! నీవే!! నీవే!!!

వాణి నీవే
పాణి నీవే
వేణి నీవే
భాణి నీవే

భువి నీవే
దివి నీవే
దేవి నీవే
భావి నీవే
కల్పన నీవే
కవిత నీవే
వనిత నీవే
నవత నీవే

ఊహ నీవే
ఊపిరి నీవే
ఉదయం నీవే
సహృదయం నీవే
భాగ్యం నీవే
సగభాగం నీవే
రాగం నీవే
అనురాగం నీవే

ఇగురు నీవే
చిగురు నీవే
వగరు నీవే
పొగరు నీవే

మందారం నీవే
మధురం నీవే
శృంగారం నీవే
అంగారం నీవే

తళుకు నీవే
బెళుకు నీవే
ఉలుకు నీవే
పలుకు నీవే

శ్రమ నీవే
శక్తి నీవే
ప్రేమ నీవే
పేగు నీవే

సంపత్తు నీవే
గమ్మత్తు నీవే
మత్తు నీవే
చిత్తు నీవే

తలుగు నీవే
తగవు నీవే
తరువు నీవే
తన్మయి నీవే

సోయి నీవే
హాయి నీవే
రేయి నీవే
సురాయి నీవే


రవి నీవే
కవి నీవే
విరి నీవే
తావి నీవే

మస్తకం నీవే
పుస్తకం నీవే
చిత్తం నీవే
విత్తం నీవే

భిందు నీవే
సింధు నీవే
నింగి నీవే
నేల నీవే

అందం నీవే
బందం నీవే
ప్రణవం నీవే
ప్రణయం నీవే

తల్లి నీవే
చెల్లి నీవే
మల్లి నీవే
పాలవెల్లి నీవే



నమిలకొండ నాగేశ్వర్ రావు
మేడ్చల్,
సెల్: 86885 53470



## పవన్ ప్రయాణంపై అకీర వీడియో

### రేణూదేశాయ్ విడుదలతో వైరల్

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ అఖండ విజయాన్ని సాధించడంతో మెగా ఫ్యామిలీ అంతా సంతోషంగా ఉంది. ఈ నేపథ్యంలో పవన్ కుమారుడు అకీరా ఎడిట్ చేసిన వీడియోను రేణూ దేశాయ్ పంచుకోగా వైరల్‌గా మారింది. నెటిజన్లంతా కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'కొన్ని వారాల క్రితం వాళ్ల నాన్న కోసం అకీరా నందన్ చేసిన ప్రత్యేక వీడియో ఇది. పవన్‌పై తనకున్న ప్రేమకు ఇది నిదర్శనం. తన తండ్రి విజయంపై అకీరా ఎంతో ఆనందంగా, గర్వంగా ఉన్నాడు' అని రేణు దేశాయ్ దీనికి క్యాప్షన్ పెట్టారు. 'ఖుషి' నుంచి 'భీమ్లానాయక్' వరకు పవన్ చేసిన సినిమాల్లోని పవర్‌ఫుల్ డైలాగులతో దీన్ని ఎడిట్ చేశారు. ఈ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతుండగా 'గూస్‌బంప్స్ వస్తున్నాయంటూ' నెటిజన్లు ఆసక్తికర కామెంట్స్ చేస్తున్నారు. 'ఎమ్మెల్యే గారి అబ్బాయి చేసిన వీడియో బాగుంది' అని ఒకరు కామెంట్ చేయగా.. 'ఇప్పటి వరకు చూసిన వాటిల్లో ఇదే బెస్ట్ వీడియో' అని మరో అభిమాని పేర్కొన్నారు.

# విజయ్ దేవరకొండతో సాయిపల్లవి

విజయ్ దేవరకొండతో సాయిపల్లవి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. సాయిపల్లవి సినిమాల విషయంలో వేగం పెంచింది. ప్రస్తుతం ఆమె తెలుగులో 'తండేల్' చేస్తూనే హిందీలో రెండు భారీ ప్రాజెక్ట్‌లు చేస్తోంది. అలాగే తమిళంలో 'అమరన్'లో నటిస్తోంది. అయితే ఇప్పుడామె కొత్తగా మరో కథ విన్నట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ హీరోగా రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. దీన్ని దిల్‌రాజు నిర్మిస్తున్నారు. అందమైన ప్రేమకథతో రూరల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానున్న ఈ చిత్రం కోసం నాయికగా సాయిపల్లవిని ఖరారు చేసేందుకు చిత్ర బృందం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఆమెతో కథా చర్చలు పూర్తయ్యాయని.. సినిమా విషయంలో ఆమె సానుకూలంగా ఉందని సమాచారం. దీన్ని వచ్చే ఏడాది సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు.





## కాంచన-4ను అనౌన్స్ చేసిన లారెన్స్

తమిళం నుంచి వచ్చిన బ్లాక్ బస్టర్ హారర్ చిత్రాలలో కాంచన ఫ్రాంచైజీ ఒకటి. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు దర్శకుడు రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రాలు సూపర్ హిట్ అందుకున్నాయి. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీలో ముని, కాంచన 2, కాంచన 3 చిత్రాలు వచ్చి మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు తాజాగా ఈ ఫ్రాంచైజీ నుంచి కాంచన 4ను అనౌన్స్ చేశారు రాఘవ లారెన్స్. ఈ సందర్భంగా పోస్టర్‌ను కూడా విడుదల చేశాడు. ఇక రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానున్నట్లు ప్రకటించారు. 2025 సమ్మర్‌లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు.



## డబుల్ ఇస్మార్ట్ పూర్తిలో రామ్

టాలీవుడ్ నటుడు ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ప్రస్తుతం ఒక మంచి కంబ్యాక్ కోసం ఎదురుచూస్తున్నాడు. అప్పుడెప్పుడో ఇస్మార్ట్ శంకర్‌తో హిట్ కొట్టిన రామ్‌కి మళ్లీ సరైన హిట్ పడలేదు. ఈ మధ్య బోయపాటి డైరెక్షన్‌లో వచ్చిన స్కంద కూడా బాక్సాఫీస్ వద్ద అట్టర్ ఎ÷–లాప్‌గా నిలిచింది. ఈ సినిమా అనంతరం స్టార్ దర్శకుడు పూరీ జగన్నాథ్‌తో రామ్ డబుల్ ఇస్మార్ట్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే వరుస ప్రాజెక్ట్‌లను లైన్‌లో పెడుతున్నాడు రామ్. ఇప్పటికే హరిశ్ హరీష్ శంకర్‌తో ఒక సినిమా చేయబోతున్న రామ్ మరోవైపు నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి డిజిటల్ ఎంట్రీకి రెడీ అవుతున్నాడు. ఇక ఇవి కాకుండా మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను రామ్ లైన్‌లో పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్‌తో రామ్ సినిమా చేయ-ంబోతున్నట్లు తెలుస్తుంది. హరీష్ శంకర్ ప్రస్తుతం మిస్టర్ బచ్చన్ షూటింగ్‌లో బిజీగా ఉండడంతో ఈ గ్యాప్‌ను రామ్ త్రివిక్రమ్‌తో ప్లాన్ చేయనున్నట్లు తెలుస్తుంది. రామ్ సోంత నిర్మాణ సంస్థ స్రవంతి బ్యానర్ లోనే ఈ ప్రాజెక్టు ఉంటుందని సమాచారం. త్వరలోనే ఈ విషయానికి సంబంధించిన క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## కొత్త ప్రాజెక్ట్ ప్రకటించిన నటుడు సిద్దార్థ్



గతేడాది చిన్నా సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న తమిళ నటుడు సిద్దార్థ్ తాజాగా తన కొత్త ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేశాడు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం మిస్ యూ . కలథిల్ సంతిప్పోమ్, మాప్లా సింగం చిత్రాల ఫేమ్ ఎన్. రాజశేఖర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ఆషికా రంగనాథ్ కథానాయికగా నటించబోతుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను ప్రముఖ నటుడు శివ కార్తికేయన్ ఎక్స్ వేదికగా విడుదల చేశాడు. ఈ పోస్టర్ చూస్తే.. రైల్వే స్టేషన్ నుంచి సిద్దార్థ్ వస్తున్నట్లు ఉంది. చాల రోజుల తరువాత ఈ పోస్టర్లో కొత్తగా కనిపిస్తున్నాడు. 7 మైల్స్ పర్ సెకండ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై శామ్యూల్ మాథ్యూ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. జిబ్రాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. కరుణాకరన్, బాల, సాస్తిక రాజేంద్రన్ తదితరులు ఈ సినిమాల కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



# నేడు విడుదలవుతున్న మనమే

టాలీవుడ్ యువ కథానాయకుడు శర్వానంద్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. కెరీర్ ప్రారంభం నుంచే 'గమ్యం', 'యువసేన', 'అమ్మ చెప్పింది', 'వెన్నెల' సినిమాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకు న్నాడు. అయితే ఈ నటుడికి ఇప్పటికి తెలుగులో బిరుదు లేదన్న విషయం తెలిసిందే. తాజాగా తన కొత్త సినిమా ఈవెం ట్‌లో తన బిరుదును ప్రకటించారు మేకర్స్. శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మనమే' . ఈ సినిమాకు శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తుండగా.. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రం జూన్ 7న శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక విడుదల తేదీ దగ్గరపడటంతో ప్రమోషన్స్ షురూ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే చిత్ర బృందం హైదరాబాద్‌లో బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ వేడుకకు టాలీవుడ్ దర్శకులు మారుతి, శివ నిర్వాణ, సాయి రాజేశ్‌లతో పాటు తదితరులు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై చిత్రం మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు.



## సరికొత్త రికార్డు సెట్ చేయనున్న పుష్ప కపుల్

ఎప్పుడూ ఒకేరకమైన రికార్డులు సెట్ చేస్తుంటే ఏం బావుంటుంది. అప్పుడప్పుడూ కొత్తగా చేయాలి. పక్కనోళ్లు మనల్ని చూసి ఫాలో అయ్యేలాగా చేయాలి. అప్పుడు కదా మజా వచ్చేది అని అంటోంది పుష్ప కపుల్. వాళ్ల ఆలోచనలకీ, ఇష్టాలకీ తగ్గట్టే నెట్టింట్లో సరికొత్తగా హల్ చల్ అవుతున్నారు. ఇంతకీ పుష్ప కపుల్ చేస్తున్న సందడేంటి? పుష్ప పుష్ప పుష్ప పుష్ప అంటూ... పుష్పరాజ్ మేనియా మరింత జోరందుకుంది. ఒక్కడే కష్టపడితే ఏం బావుంటుంది... వెంట నేనూ ఉంటా అంటూ కపుల్ సాంగ్‌తో గ్రౌండ్‌లోకి దిగేశారు రష్మిక మందన్న. పుష్ప పుష్ప పుష్ప పుష్ప అంటూ... పుష్పరాజ్ మేనియా మరింత జోరందుకుంది. ఒక్కడే కష్టపడితే ఏం బావుంటుంది... వెంట నేనూ ఉంటా అంటూ కపుల్ సాంగ్‌తో గ్రౌండ్‌లోకి దిగేశారు రష్మిక మందన్న. అసలే సామి సామి అంటూ ఫస్ట్ పార్టులో ఆమె చేసిన సందడి చూసిన జనాలు... ఇప్పుడు సెకండ్ పార్టులో వీళ్ల కెమిస్ట్రీకి ఫిదా అయిపోతున్నారు. రీసెంట్‌గా రిలీజ్ అయిన సూసేకీ సాంగ్ చార్ట్ బస్టర్ అయింది. వెరీ ఫస్ట్ ప్లేతోనే జనాలను అట్రాక్ట్ చేసేసింది సూసేకీ. మరో సామి సామి గ్యారంటీ అని అప్పుడే చెప్పుకున్నారు జనాలు. అన్నట్టుగానే సూసేకీ ఆడియన్స్ ని మెస్మరైజ్ చేస్తోంది. సింపుల్ స్టెప్పులను ట్రై చేస్తూ రీల్స్ చేస్తున్నారు ఔత్సాహికులు. ఇప్పటికే దాదాపు లక్ష రీళ్లకు పైగా క్రియేట్ అయ్యాయట సూసేకీ సాంగ్‌కి.

# రాష్ట్ర ప్రయోజనాలకోసం పనిచేద్దాం


- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి
- కేంద్రంతో సఖ్యంగా ఉంటూనే పనులు రాబట్టాలి
- ఇక నుంచి మారిన చంద్రబాబును చూస్తారు
- ఎంపీలకు నిరంతరం అందుబాటులో ఉంటా
- కొత్తగా ఎన్నికైన ఎంపీలతో చంద్రబాబు సమావేశం



**అమరావతి, ప్రజానావ:** మనమంతా కలసి పని చేస్తూ రాష్ట్ర ప్రయోజనాల కోసం కష్టపడదామని టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం కోసం ఎంపిలంతా కేంద్రంతో ఎప్పుడూ పోరాడుతూనే ఉండాలన్నారు. అలాగే తానూ ఎంపిలతో నిరంతరం టచ్‌లో ఉంటానని హామీ ఇచ్చారు. టిడిపి నుంచి ఎంపికైన కొత్త ఎంపిలతో సమావేశం గురువారం అమరావతిలో జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన టీడీపీ ఎంపీలతో చంద్రబాబు మాట్లాడుతూ.. ఇకపై వీరీరంతా మారిన చంద్రబాబును చూస్తారని అన్నారు. చంద్రబాబు మారరు.. ఎవరి మాట వినరు అనే మాట ఇక వినిపించబోదని అన్నారు. ఇకపై తనను ఎంపీలు తరచూ కలుస్తూ ఉండాలని కోరారు. ఎంత బిజీగా ఉన్నా పక్కకు వచ్చి మరీ ఎంపీలతో మాట్లాడతానని అన్నారు. రాష్ట్రంలో ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఉండబోదని.. పూర్తి రాజకీయ పాలన తెస్తామని అన్నారు. ఇకపై వీరీరు మారిన చంద్రబాబును చూస్తారు. ఇకపై బ్యూరోక్రాట్స్ పాలన ఎంతమాత్రం ఉండదు. చంద్రబాబు మారరు అనే అపవాదు నాపై ఉంది. ఇకపై అలా ఉండదు.. వీరీరే ప్రత్యక్షంగా చూస్తారు. ఎంపీలందరూ తరచూ వచ్చి కలవండి. నేను బిజీగా ఉన్నా కూడా వీరితో మాట్లాడతాను. నాకోసం ఈ ఐదేళ్లు నేతలు, కార్యకర్తలు ప్రాణాలిచ్చారు. కత్తి వీరిద పెట్టినా జై టీడీపీ, జై చంద్రబాబు అన్నారు. అధికార పార్టీ ఒత్తిడికి ఎవరూ తలొగ్గలేదు. ఇకపై ప్రతి అంశాన్ని నేను వింటాను.. నేనే చూస్తాను. ఇకపై రాజకీయ పరిపాలన ఉంటుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా కలిసి పనిచేయాలి. అందరూ ఎవరి పరిధిలో వారు పనిచేయాలి. ఈ ఐదేళ్లు నేతలు, కార్యకర్తలు పడిన ఇబ్బందులు నాకు చాలా మనోవేదన కలిగించాయి నేతలు, కార్యకర్తల కష్టం, త్యాగం, కృషి వల్లే ఇవాళ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈనెల 12 ప్రమాణ స్వీకారం చేస్తా. ఢిల్లీలో రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు సూచించారు. ఎన్నికల్లో గెలిచినందుకు వారికి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో మంత్రివర్గ కూర్పు.. తెదేపాకు ఉన్న ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించారు. ఈ భేటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పార్టీ ఎంపీలతో చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి వారితో కలిసి హాజరు కానున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో విహరించొద్దని గెలిచిన ఎంపీలకు తెదేపా అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చిన విజయాన్ని బాధ్యతగా సమాజ సేవ చేసేందుకు వినియోగించాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోని వైకాపా ఎంపీలు జగన్ కేసుల మాఫీ అజెండాతోనే ఢిల్లీలో పైరవీలు చేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలే మనందరి ప్రథమ కర్తవ్యం కావాలన్న చంద్రబాబు.. అందుకు తగ్గట్టుగానే పార్లమెంట్‌లో కృషి చేయాలన్నారు. ముందు ప్రజాస్వామ్య వ్యవస్థల్ని గౌరవించాలి, ఆ తర్వాతే మనమని తెలిపారు. వ్యవస్థలకు అతీతంగా ఎవరు వ్యవహరించినా, ఆ వ్యవస్థే తిరిగి కాటేస్తుంది అని గుర్తించాలన్నారు. పదవులు శాశ్వతం అని ఎవ్వరూ అనుకోవద్దని అన్నారు. సీఎంగా తన ప్రమాణ స్వీకారానికి మోదీని ఆహ్వానించానని, వచ్చేందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అందుబాటులో ఉన్న పలువురు ఎంపీలు ఉండవల్లిలో జరిగిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఇతర ఎంపీలు జూమ్ కాల్ ద్వారా టీడీపీపీలో పాల్గొన్నారు. ఎంపీలు అందరికీ చంద్రబాబు నాయుడు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. రేపటి ఎన్డీయే భాగస్వామ్య పక్షాల సమావేశానికి కూటమిలో భాగమైన టీడీపీ ఎంపీలు అంతా హాజరవ్వనున్నారు. నియోజకవర్గాల్లో ఉన్న ఎంపీలు నేటి రాత్రికి ఢిల్లీ చేరుకోనున్నారు. పార్లమెంటరీ భేటీ తర్వాత టీడీపీ ఎంపీలు వీరీడియాతో మాట్లాడారు. మోదీ, చంద్రబాబు, పవన్ కృషి వల్లే భారీ విజయం నమోద్కెందని అన్నారు. తెలుగు ప్రజల్లో ఉన్న కసి కూడా భారీ విజయానికి కారణం అన్నారు. ఎన్నికల ముందు నుంచి ఎన్డీఏ కూటమితో ప్రయాణిస్తున్నామని అన్నారు.

# సీఎస్ జవహర్ రెడ్డి ఔట్

- సెలవుపెట్టి వెళ్లిపోయినట్లు సమాచారం
- సెలవుపై వెళ్లిన ఆర్థికశాఖ కార్యదర్శి రావత్
- సలహాదారుల రాజీనామాలకు ఆదేశాలు
- డిప్యుటేషన్ అధికారులపై నిర్ణయం పెండింగ్



**అమరావతి, ప్రజానావ:** ఏపీలో ప్రభుత్వం ఏర్పాటుకు ముందే పలు కీలక పరిణామాలు చోటు చేసు కుంటున్నాయి. సెలవుపై వెళ్లాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిని సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది. దీంతో ఆయన సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఈ నెలాఖరును ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ కూడా సెలవుపై వెళ్లారు. అనారోగ్య కారణాలతో లీవ్ పెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జవహర్‌రెడ్డి సెలవుపై వెళ్లిన నేపథ్యంలో వెంటనే కొత్త సీఎస్‌ను నియమించే అవకాశముంది. మరోవైపు ఇప్పటికీ రాజీనామా చేయని ప్రభుత్వ సలహాదారులను తక్షణమే తొలగించాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. త్వరలో మరిన్ని కీలక నిర్ణయాలు వెలువడే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఐఏఎస్ అధికారుల పోస్టింగ్ లలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు సమాచారం. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి పదవీకాలం జూన్ నెలాఖరుకు ముగుస్తున్న నేపథ్యంలో కొత్త సీఎస్‌గా విజయానంద్‌ను నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.విజయానంద్ గత ప్రభుత్వంలో కొన్ని రోజులు అదనపు సీఎస్‌గా వ్యవహరించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్ ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలో కలెక్టర్‌గా, ఏపీ ట్రాన్స్ కో , ఏపీ జెన్ కో సీఎండీగా పనిచేశారు. రాష్ట్ర విభజన తదుపరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఎనర్జీ, ఐటీ మంత్రిత్వ శాఖల ముఖ్యకార్యదర్శిగా పనిచేయడంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. విజయానంద్ ప్రస్తుతం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఇదిలావుంటే బుధవారం చంద్రబాబును సీఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. జూన్ 12న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. మరోవైపు జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన పలువురు కీలక ఐఏఎస్ అధికారులు సెలవుపై వెళ్లినట్లు తెలుస్తుంది. ఇక గత ప్రభుత్వంలో సీఎస్ జవహర్‌రెడ్డి జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే విశాఖపట్నంలో జరిగిన భూ కుంభకోణంలో ఆయన కుమారుడు ప్రమేయం ఉన్నట్లు జనసేన పార్టీ నాయకుడు మూర్తి యాదవ్ ఘాటైన విమర్శలు చేశారు. ఆ విమర్శలకు సీఎస్ జవహరెడ్డి సైతం స్పందించారు. అనంతరం విశాఖ వేదికగా జరిగిన భూ కుంభకోణంపై సీఎస్ జవహర్ రెడ్డికి మూర్తి యాదవ్ పలు ప్రశ్నలు సంధించారు. వీటికి సమాధానం చెప్పాలంటూ సీఎస్ జవహరెడ్డికి సవాల్ విసిరారు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్ పై వచ్చిన అధికారుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త ప్రభుత్వం రానున్న దృష్ట్యా డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులను రిలీవ్ చేయకూడదని నిర్ణయించింది. డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు రిలీవ్ చేయాలని ఇప్పటికే పలువురు అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చిన వారిపై గతంలో పెద్ద ఎత్తున విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఇకపోతే రాష్ట్రంలో టీచర్ల బదిలీలపై ఎన్నికల కోడ్‌కు ముందు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేశారు. ఎలాంటి బదిలీలు చేపట్టవద్దని డీఈవోలను ఆదేశించారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పత్తి సాగుకే రైతుల ఆసక్తి

**తొలకరి కోసం ఎదురు చూపులు**

**సోయాతో నష్టాలు వస్తాయన్న భావన**




**ఆదిలాబాద్, ప్రజానావ:** ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగులు తీస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అందుకే పత్తి విత్తనాలకు డిమాండ్ పెరుగుతోంది. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సోయా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే సమయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది. అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పంటల ధరలు అంచనాలకు మించి ధర పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొనుగోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నారు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వాతావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సాగు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడులు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పత్తి పంటతో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావనతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అయితే ధరలు భాగానే ఉన్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయం గా పెరుగనుంది. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

# చురుకుగా రుతుపవనాల కదలిక

**• తెలంగాణలో వర్షాలు ప్రారంభం • పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**



**హైదరాబాద్, ప్రజానావ:** నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఈనెల 3న రాష్ట్రంలోని ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..ప్రస్తుతం తెలంగాణ లోని నారాయణపేట, ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ గుండా రుతుపవనాలు కదులుతున్నట్లు చెప్పింది. 3 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని, కదలికలు ఇదే తరహాలో ఉంటే వారం రోజుల్లో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తాయని అంచనా వేస్తోంది. దీని కారణంగా పలుజిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మెదక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల వీరీదుగా రుతుపవనాలు వ్యాపిస్తున్నాయి. కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది, తెలంగాణలో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ తెలంగాణాలో అత్యధికంగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడతాయని ఐఎండీ తెలిపింది. రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పగటి పూట కొంతసేపు గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నప్ప టికీ.. ఆశాశం మేఘావృతం కావడంతో క్రమంగా ఉష్ణోగ్రతల తీవ్రత తగ్గుతూ వస్తోంది. సాయంత్రానికి పూర్తిగా చల్లని వాతావరణం ఏర్పడుతోంది. రెండు రోజు లు రాష్ట్రంలో ఉష్ణో గ్రతలు సాధారణం, అంతకంటే తక్కువగా నమోదు కావొచ్చని ఆ శాఖ అంచనా వేసింది. నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రత: దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది దక్షిణ ఆంధప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వివరించింది. దీని ప్రభావంతో తెలంగాణలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలను పరిశీలిస్తే నిజామాబాద్‌లో 40.1 డిగ్రీ సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోద్కెంది. ఇక కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.5 డిగ్రీ సెల్సియస్‌గా నమోద్కెంది.



## నగర వాసులకు అలర్ట్

**పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం**

**హైదరాబాద్, ప్రజానావ:** నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 6 నుంచి మరుసటి రోజు ఆరు గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వాటర్‌బోర్డు అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. నగరంలోని లింగంపల్లి, పటాన్‌చెరు, ఈఎస్‌ఐ కమాన్ ప్రాంతాల్లో ఉన్న 900 ఎంఎం డయా పీఎస్సీ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం ఉదయం ఆరు నుంచి శనివారం ఉదయం ఆరుగంటల వరకు 24 గంటలపాటు జరగనున్నాయి. దీంతో అపరేషన్ మెయింటనెన్స్ 8, 9డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని, పటాన్‌చెరు, ఆర్సీ పురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందా నగర్, గంగారం, మదీనాగూడ, హాఫీజ్ పేట్, డోయె న్స్‌కాలనీ, ఎస్‌బీఐ ట్రెనింగ్ సెంటర్, బీహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, టౌన్‌షిప్, హెచ్‌సీయూ, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతవాసులకు అంతరాయం తలెత్తుందని తెలిపారు.

## కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

**సిద్ధిపేట, ప్రజానావ:** ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పలువురు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

# ప్రభుత్వం ఏర్పడక ముందే దాడులు

**పోలీస్ వ్యవస్థ నిస్తేజంగా మారింది**

**ఎక్స్ వేదికగా మాజీ సీఎం జగన్ ఆవేదన**



**అమరావతి, ప్రజానావ:** ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడక ముందే తెలుగుదేశం పార్టీ దాడులతో రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భయానక వాతావరణం నెలకొందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పాటుకాక ముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటుకాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికారపార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. వెరసి ఐదేళ్లుగా పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని జగన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. 175 అసెంబ్లీ స్థానాలకు కేవలం 11 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇక తెలుగుదేశం పార్టీ 135 స్థానాల్లో అఖండ విజయంతో అధికారం చేపట్టేందుకు సిద్ధమైంది. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ఏకంగా 164 స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో ఓటమిని అంగీకరిస్తూ జగన్ సీఎం పదవికి రాజీనామా చేసేశారు. ఇక ఈనెల 12న రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది.




# అమెరికా 'సూపర్' విక్టరీ

## పాక్‌పై సంచలన విజయం నమోదు

**డల్లాస్:** ప్రశాంతంగా సాగిపోతున్న టీ20 ప్రపంచకప్ 2024లో పెను సంచలనం నమోదైంది. పాకిస్థాన్‌పై అమెరికా చరిత్రాక విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. గ్రూప్-ఏ లో డల్లాస్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సూపర్ ఓవర్‌లో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో అమెరికా 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. సూపర్ ఓవర్‌లో అమెరికా ఒక వికెట్ నష్టపోయి 18 పరుగులు చేసింది. ఇందులో 7 రన్స్ ఎక్స్‌ట్రాలే. 19 పరుగుల లక్ష్యఛేదనలో పాక్ 13/1 రన్స్‌కు పరిమితమైంది. అంతకముందు 160 పరుగుల లక్ష్యఛేదనలో అమెరికా ఓపెనర్ స్టీవెన్ టేలర్ (12) తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరినా.. కెప్టెన్ మోనాంక్ పటేల్ (50బీ 38 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్), వన్‌డౌన్ బ్యాటర్ ఆండ్రీస్ గౌస్ (35బీ 26 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), ఆరోన్ జోన్స్ (25బీ 19 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), నితీశ్ కుమార్ (14బీ 14 బంతుల్లో) రాణించారు. చివరి ఓవర్‌లో అమెరికా విజయానికి 15 పరుగులు అవసరం కాగా.. మొదటి ఐదు బంతుల్లో నాలుగు సింగిల్స్, ఓ సిక్స్ వచ్చాయి. చివరి బంతికి నితీశ్ ఫోర్ బాదడంతో స్కోర్లు సమం అయ్యాయి. దీంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారితీసింది. పాక్ బౌలర్లలో మహ్మద్ అమిర్, నసీమ్ షా, హరిస్ రవూఫ్ తలో వికెట్ పడగొట్టారు. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ బ్యాటర్లలో ఓపెనర్ బాబర్ అజామ్ (44బీ 43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులు) రాణించగా.. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ షాదాబ్ ఖాన్ (40బీ 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) దూకుడుగా ఆడాడు. ఇఫ్తికార్ అహ్మద్ (18), షాహీన్ అఫ్రిది (23) పరుగులు చేయగా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. అమెరికా బౌలర్లలో కెంజిగే 3, నేత్రవల్కర్ 2, అలీ ఖాన్, జస్దీప్ సింగ్ తలో వికెట్ పడగొట్టారు.





# టీ 20 వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా బోణీ

**బార్బడోస్:** బార్బడోస్‌లో జరిగిన ఆస్ట్రేలియా, ఓమన్ మ్యాచ్‌లో ఆసీస్ ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియా మొదట బ్యాటింగ్ చేయగా.. ఫామ్‌లో ఉన్న ట్రావిస్ హెడ్‌ను 12 పరుగులకే ఔట్ చేశారు. మ్యాక్స్‌వెల్‌ను 0 పరుగులకే ఔట్ చేయగా.. ఫామ్ లేమి కొట్టొచ్చినట్లు కనిపించింది. ఆసీస్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ హాఫ్ సెంచరీలో రాణించగా.. మార్కస్ స్టోయినిస్ ఆరు సిక్సులు బాది 67 పరుగులు చేశాడు. దీంతో ఆసీస్ 164/5తో ఇన్నింగ్ ముగించింది. ఓమన్ బౌలర్లలో మెహ్రాన్ ఖాన్ రెండు వికెట్లు తీయగా.. కరి ముల్లా, బిలాల్ ఖాన్ ఒక్కో వికెట్ తీసుకున్నారు. అనంతరం 165 టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఓమన్ బ్యాటర్లు ఏ దశలోనూ ఆకట్టుకోలేకపోయారు. ఆరు పరుగులకే మొదటి వికెట్ కోల్పోగా.. 34 పరుగులకు నాలుగు వికెట్లు కోల్పోయి ఓమన్ కష్టాల్లో పడింది. ఈ క్రమంలో ఆచి తూచి ఆడిన బ్యాటర్లు గెలిచేందుకు కాకుండా స్కోరు అంతరాన్ని తగ్గించేందుకు ప్రయత్నించారు. ఓమన్ బ్యాటర్లలో అయాన్ ఖాన్ 2 సిక్సులు, రెండు ఫోర్లతో 36 పరుగులతో చేయగా.. మెహ్రాన్ ఖాన్ 16 బంతుల్లోనే 2 ఫోర్లు, 2 సిక్సులు బాది 27 పరుగులు వేగంగా సాధించాడు. నలుగురు బ్యాట్స్‌మెన్ మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. 20 ఓవర్లలో 125 పరుగులకు తొమ్మిది వికెట్లు కోల్పోయి ఓమన్ ఈ మ్యాచ్‌లో ఓడిపోగా.. ఆసీస్ టీ 20 వరల్డ్ కప్‌లో బోణీ కొట్టింది. ఆసీస్ స్టార్ బౌలర్ ప్యాట్ కమిన్స్‌ను ఈ మ్యాచ్‌లో బెంచ్‌కే పరిమితం చేశారు. డేవిడ్ వార్నర్ 56 పరుగులతో ఫామ్‌ను అందుకోగా.. మార్కస్ స్టోయినిస్ 3 వికెట్లు, 67 పరుగులతో రాణించడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ లభించింది.



# టైటిల్ పోరులో స్వైటెక్, పౌలీ

● టీనేజ్ సంచలనం ఆండ్రీవా జోరుకు కళ్లెం ● ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్ స్లామ్

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో హ్యాట్రిక్‌పై గురిపెట్టిన ఇగా స్వైటెక్ (పోలెండ్) టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. దూకుడైన ఆటతో ఈ టాప్‌సీడ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం మహిళల సింగిల్స్ సెమీస్‌లో 6-2, 6-4తో మూడో సీడ్ కొకోగాఫ్ (అమెరికా)ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్‌లో రెండో సెట్‌లో మాత్రమే స్వైటెఖ్‌కు గాఫ్ నుంచి పోటీ ఎదురైంది. శనివారం టైటిల్ పోరులో పౌలీని (ఇటలీ)తో స్వైటెక్ అమీతుమీ తేల్చుకోనుంది. మరో సెమీస్‌లో పన్నెండో సీడ్ పౌలీని 6-3, 6-1 టీనేజ్ సంచలనం ఆండ్రీవా (రష్యా) జోరుకు కళ్లెం వేసింది.

### తుది నాలుగులో జ్వెరెవ్

జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫ్రెంచ్ ఓపెన్‌లో తుది నాలుగు జాబితాలో చోటు సంపాదించాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్‌లో నాలుగో సీడ్ జ్వెరెవ్ 6-4, 7-6 (7-5), 6-4తో పదకొండో సీడ్ డిమినర్ (అర్జెంటీనా) పోరాటానికి తెరదించాడు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ జోరుకు బ్రేక్ పడింది. సెమీ ఫైనల్‌లో ఈ జోడీ 5-7, 6-2, 2-6 తేడాతో సిమోన్ బొలిలీ- ఆండ్రియా వావాపోరి (ఇటలీ) చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు లారా సిగ్మండ్ (జర్మనీ)- రోజర్ వెస్లిన్ (ఫ్రాన్స్) జంట మిక్స్‌డ్ డబుల్స్‌లో టైటిల్ గెలుచుకుంది.



# పసికూనల మధ్య టఫ్ ఫైట్

## గట్టెక్కిన ఉగాండా

**గయానా :** ఉగాండా, పపువా న్యూ గినియా మధ్య గయానాలో జరిగిన మ్యాచ్‌లో ఉగాండా మొదటి విజయం నమోదు చేసుకుంది. ఇరు జట్ల బౌలర్లు చెలరేగిన ఈ మ్యాచ్‌లో రెండు టీంలతో విజయం దోబుచులాడి ఉగాండానే విజయం వరించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్న ఉగాండా, పపువా బ్యాటర్లపై ఆధిపత్యం చెలాయించింది. పపువా 0 పరుగుల వద్దే మొదటి వికెట్ కోల్పోగా, 19 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతూ కష్టాల్లో పడింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోతూ 77 పరుగులకు ఆలౌట్ కాగా, కేవలం ముగ్గురు మాత్రమే డబుల్ డిజిట్ స్కోరు అందుకున్నారు. 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే అవుట్ కాగా.. పపువా న్యూ గినియా నాలుగు ఫోర్లు, ఒక సిక్సుతో ఇన్నింగ్‌ను ముగించింది. ఉగాండా బౌలర్లు సమష్టిగా రాణించి నలుగురు రెండేసి వికెట్లు తీయగా.. కెప్టెన్ మసాబా ఒక వికెట్ తీశాడు. 78 పరుగుల ఛేజింగ్‌తో బ్యాటింగ్‌కు దిగిన ఉగాండా ఓపెనర్లు 0,1, వనడౌన్ బ్యాటర్ 1 పరుగుకే పెవిలియన్‌కు చేరగా 6 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఎక్కడా కూడా ఉగాండా మ్యాచ్ గెలుస్తుందని ఎవరూ ఊహించలేరు. కానీ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రిజయాత్ అలీ షా.. కేవలం ఒక్క ఫోరు మాత్రమే బాది 33 పరుగులు చేసి ఉగాండాకు మరుపురాని విజయాన్ని అందించాడు. హిరో ఇన్సింగ్స్ ఆడిన అలీ షా కేవలం ఒక్క బౌండరీ మాత్రమే కొట్టాడు. మిగతావన్నీ సింగిల్స్, డబుల్స్ రూపంలో రాబట్టి బౌలింగ్ పిచ్‌లో ఎలా ఆడాలో నేర్పించాడు. ఉగాండా బ్యాటర్లలో జిమా మియాగి 13 పరుగులతో అలీషాకు తోడుగా సాయమందించగా.. ఉగాండా ఉత్కంఠ భరిత పోరులో విజయం సాధిచింది. ఉగాండా 18.2 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 78 పరుగులను ఛేజ్ చేసింది. ఇందులో కేవలం రెండు ఫోర్లు మాత్రమే ఉండటం విశేషం.



# వాన్ కామెంట్.. జాఫర్ కౌంటర్

**న్యూయార్క్:** టీ20 ప్రపంచ కప్‌లో భారత్ బోణీ కొట్టింది. ఐర్లాండ్‌ను చిత్తు చేసి ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో బౌలర్లకు సహకారం అందించిన పిచ్‌పై భారత స్టార్లు చెలరేగిపోయారు. అనూహ్యంగా బౌన్స్ అవుతూ బ్యాటర్లను ఇబ్బందికి గురి చేసింది. డ్రాప్ ఇన్ పిచ్‌లు కావడంతో ఎలా స్పందిస్తుందో అర్థం చేసుకోవడం కష్టమేనని భారత కెప్టెన్ రోహిత్ శర్మ కూడా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో న్యూయార్క్ పిచ్‌పై ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ కామెంట్ చేయగా.. భారత మాజీ ఆటగాడు వసీమ్ జాఫర్ అద్భుతమైన కౌంటర్ ఇచ్చాడు. 'యూఎస్ఏలో క్రికెట్ వ్యాప్తి కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయి. అయితే, పెద్దగా ప్రమాణాలు లేని ఇలాంటి పిచ్‌లపై ఆటగాళ్లు క్రికెట్ ఆటడం ఆమోదయోగ్యం కాదు. వరల్డ్ కప్‌లో మరీ కష్టం. దీని కోసం ప్లేయర్లు తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది' అని వాన్ పోస్టు పెట్టాడు. దీనికి 'న్యూయార్క్‌లో తయారు చేసిన ఈ పిచ్ అద్భుతమైందే. అమెరికన్ ప్రేక్షకులకు టీ20లతోపాటు టెస్టు క్రికెట్‌పై ఆసక్తి కలిగించేందుకు ఇదొక చక్కటి ఆలోచనగా ఉంది' అని జాఫర్ కామెంట్ పెట్టాడు.

### ఇదే పిచ్‌పై దాయాదుల పోరు

జూన్ 9న (ఆదివారం) ప్రపంచంలోని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూసే భారత్ - పాక్ మ్యాచ్ జరగనుంది. దీనికి వేదిక కూడా న్యూయార్క్ పిచ్. అయితే, ఇప్పుడు ఐర్లాండ్‌తో మ్యాచ్‌ను గమనిస్తే.. దాయాదుల పోరు ఫలితం ఎలా ఉంటుందోనని అభిమానుల్లో ఆందోళన నెలకొంది. దీనిపై ప్రముఖ వ్యాఖ్యాత హర్షా భోగ్లే స్పందిస్తూ.. 'పిచ్‌లకు ఏమైనా చేయండి. ఇలాంటి దానిపై భారత్ - పాక్ మ్యాచ్‌ను ఊహించుకోవడం కూడా కష్టమే' అని పోస్టు చేశారు.



Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116